



మంచుదొంతరల మధ్య సూర్యోదయం



సాయంత్రం జోరు వాన



వర్షం తరువాత ఆకాశంలో విరిసిన హరివిల్లు

ప్రకృతి కాంత.. పులకింత

● భిన్న వాతావరణాలతో ఆహ్లాదం

రామకుప్పంలో బుధవారం వాతావరణ మార్పులు జనాన్ని ఆశ్చర్యానికి గురిచేశాయి.దట్టమైన పొగమంచు, చిరుజల్లులు ఉదయం జనాన్ని మేల్కొలిపాయి. 8గంటలకు మంచుదొంతరల మధ్య సూర్యోదయమైంది. మధ్యాహ్నం ఆకాశం మేఘావృతమై చిరుజల్లులు కురిసిన కాసేపటికే తిరిగి సూరీడు తన ప్రతాపం చూపాడు. సాయంత్రం 4గంటల ప్రాంతంలో 15 నిమిషాలు కుండపోత వర్షం కురిసింది.అనంతరం ఆకాశంలో అందమైన హరివిల్లు ఆవిష్కృతమై అలరించింది. 10 నిమిషాల తర్వాత తిరిగి పడమటి సూర్యుడు ప్రత్యక్షమయ్యాడు. సూర్యాస్తమయ వేళ ఆకాశంలో ఆకాశంలోని సూర్యుడు సముద్రపు అలలను తాకినట్టుగా కన్పించింది.

- రామకుప్పం, ఆంధ్రజ్యోతి



పలమనేరు పంప్‌హౌస్ సమీపంలోని కౌండిన్య నదిలో డంప్ చేసిన మట్టి



నునుపు మట్టి నీటిలో కలిసిపోయేలా ఎత్తిపోస్తున్న ఎక్స్‌కవేటర్

మట్టినీ వదలని
ఇసుక స్మగ్లర్లు

పలమనేరు, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): పలమనేరులో స్మగ్లర్ల ధాటికి కౌండిన్య నదిలో ఉన్న ఇసుక ఖాళీ అయిపోయింది.దీంతో ఇసుక కోసం వీరంతా కొత్త మార్గాన్ని ఎంచుకున్నారు.నది సమీపంలోని ప్రభుత్వ భూముల్లో ఉన్న మట్టిని ఎక్సకవేటర్ల ద్వారా తవ్వి, ట్రాక్టర్లలో నింపి నది గుంతల్లో పడేస్తారు.ఈ మట్టిని ఎక్సకవేటర్‌తో బాగా ఎత్తిపోసి అందులో నునుపు మట్టి నీటిలో కలిసిపోయేలా చేస్తారు.తరువాత మిగిలిన ఇసుకను పోలిన మట్టిని ఎక్సకవేటర్ సాయంతో ట్రాక్టర్లకు నింపి రవాణా చేసి సొమ్ము చేసుకుంటున్నారు. కొందరు స్మగ్లర్లు ఈ ఇసుకను స్థానికంగా విక్రయిస్తుండగా మరికొందరు అనువైన ప్రాంతానికి తరలించి డంప్ చేసుకొని రాత్రి వేళల్లో పొరుగున ఉన్న కర్ణాటక రాష్ట్రంలోని కోలారుకు, బెంగళూరుకు తరలిస్తున్నారు. అక్కడ ఇసుకకు డిమాండు ఉన్నందున ఒక టిప్పర్ ఇసుక రూ.80వేల నుంచి లక్ష రూపాయల దాకా ధర పలుకుతోంది. దీంతో స్మగ్లర్లు రాత్రి వేళల్లో డంప్‌ల నుంచి ట్రాక్టర్లలో ఫిల్టర్ ఇసుకను తరలించి సొమ్ము చేసుకుంటున్నారు.స్మగ్లర్లకు రాజకీయ అండ వుండడంతో రెవెన్యూ అధికారులు పట్టించుకోవడం లేదు. మైనింగ్ అధికారులు కూడా పట్టనట్లే వ్యవహరిస్తున్నారు.



కేటిల్‌ఫారం చెక్‌డ్యాం పక్కనే అటవీ శాఖకు చెందిన చింతతోపు మట్టిని తవ్వి తరలిస్తున్న దృశ్యం

ఎల్పీజీ బాట్లింగ్ ప్లాంట్‌కు
నేడు ప్రారంభోత్సవం

వర్చువల్‌గా పాల్గొనబోతున్న ప్రధాని, సీఎం



చిత్తూరు కలెక్టరేట్, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): పూతలపట్టు మండలం ఎర్రచెరువుపల్లె వద్ద రూ.200 కోట్లతో నిర్మించిన ఇండియన్ ఆయిల్ ఎల్పీజీ బాట్లింగ్ ప్లాంట్‌ను గురువారం ప్రధాని నరేంద్ర మోదీ ప్రారంభించనున్నారు. కర్నూలు పర్యటనకు వస్తున్న ఆయన అక్కడినుంచే వేలాది కోట్ల రూపాయల అభివృద్ధి పనులకు వర్చువల్‌గా శంఖుస్థాపనలు, ప్రారంభోత్సవాలు చేయనున్నారు. ఎల్పీజీ బాట్లింగ్ ప్లాంట్‌ను గురువారం మధ్యాహ్నం 3 గంటలకు ప్రారంభించనున్నారు. ఈ కార్యక్రమంలో సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్‌కళ్యాణ్, కేంద్ర పెట్రోలియం, సహజవాయు శాఖ మంత్రి హర్దీప్ సింగ్ పూరి, సహాయమంత్రి సురేష్ గోపి, చిత్తూరు ఎంపీ దగ్గుమళ్ల ప్రసాదరావు తదితరులు పాల్గొంటారు.చిత్తూరు, కడప జిల్లాలతో పాటు తమిళనాడు రాష్ట్రానికి చెందిన సుమారు ఏడులక్షల మంది గ్యాస్ వినియోగదారులకు ఈ బాట్లింగ్ ప్లాంట్ ఉపయోగపడనుంది.

అనుమతి లేకుండానే ఎన్‌హెచ్‌ఎం నోటిఫికేషన్!

చిత్తూరు రూరల్, అక్టోబరు 15(ఆంధ్రజ్యోతి):నేషనల్ హెల్త్ మిషన్ కింద ఉమ్మడి చిత్తూరు జిల్లావ్యాప్తంగా వివిధ విభాగాల్లో 56 పోస్టుల భర్తీకి ఈ నెల 9వ తేదిన జిల్లా వైద్య ఆరోగ్య శాఖ ఓ నోటిఫికేషన్ విడుదల చేసింది. అయితే రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ అధికారుల అనుమతి లేకుండా దీన్ని విడుదల చేశారని ప్రచారం జరుగుతోంది.దీంతో ఈ నోటిఫికేషన్ ముందుకు సాగేలా కనపడలేదు.నోటిఫికేషన్‌కు దరఖాస్తు ఫీజు కూడా ఎప్పుడూ లేనట్టు రూ.500 నిర్ణయించడంపై అభ్యర్థులు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు.నోటిఫికేషన్‌లో పోస్టులకు రోస్టర్‌ను తెలియజేయకపోవడంతో అనర్హులు కూడా దరఖాస్తు చేసి డబ్బు, సమయం వృథా చేసుకునే అవకాశముంది.

20 మండలాల్లో వర్షం

చిత్తూరు కలెక్టరేట్, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి):గడిచిన 24 గంటల్లో జిల్లావ్యాప్తంగా 20 మండలాల్లో తేలికపాటి వర్షం కురిసింది.ఐరాలలో 22.4, చౌడేపల్లిలో 18, వెదురుకుప్పంలో 10.2, విజయపురంలో 9.2, పులిచెర్ల, గుడుపల్లె మండలాల్లో 6.8, గంగవరంలో 6.4, శ్రీరంగరాజపురంలో 5.4, కుప్పంలో 5.2, సోమలలో 4.6, రామకుప్పం, తవణంపల్లె మండలాల్లో 4.2, పూతలపట్టులో 3.4, శాంతిపురం, గుడిపాల మండలాల్లో 3, పుంగనూరులో 2.4, నగరి, కార్వేటినగరం మండలాల్లో 2.2, నింద్రలో 1.2, పెనుమూరులో 0.2 మిమీ వర్షపాతం నమోదయ్యింది.

తిరుపతి జిల్లాకు హంద్రీ నీవా జలాలు

● రూ. 126 కోట్లు మంజూరు చేస్తూ జీవో జారీ

తిరుపతి/చంద్రగిరి, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): తిరుపతి జిల్లాలోకి హంద్రీ-నీవా జలాలను మళ్లించేందుకు రాష్ట్ర ప్రభుత్వం రూ.126.06 కోట్లు మంజూరు చేసింది. అన్నమయ్య జిల్లా కేవీపల్లె మండలం అడవిపల్లి రిజర్వాయర్ నుంచి చిత్తూరుకు ఏర్పాటు చేసిన నీవా బ్రాంచి కెనాల్ నుంచీ చంద్రగిరి, తిరుపతి, తిరుమల వరకూ నీటిని మళ్లించేందుకు జలవనరుల శాఖ ఇంజనీర్ ఇన్ చీఫ్ ఫిబ్రవరి 8, మార్చి 5వ తేదీల్లో ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపించారు. రూ.127 కోట్ల అంచనా వ్యయంతో చంద్రగిరి మండలం నారావారిపల్లి సమీపంలోని మూలపల్లి చెరువుకు, అక్కడి నుంచీ మరో నాలుగు చెరువుల మీదుగా కళ్యాణి డ్యామ్‌కు మళ్లించేలా డిజైన్ రూపొందించారు. మార్గమధ్యంలో 1154 ఎకరాలకు సాగునీరందించడానికి కూడా ప్రతిపాదించారు. దీనిపై చంద్రగిరి ఎమ్మెల్యే పులివర్తి నానీ సీఎం చంద్రబాబు, మంత్రులు నారా లోకేశ్, నిమ్మల రామానాయుడును పలుమార్లు కలిసి ఈ ప్రతిపాదనలను ఆమోదించాలని కోరారు. దీంతో ఈ నెల 3న జరిగిన మంత్రిమండలి సమావేశంలో ఆమోదం లభించింది. తాజాగా జలవనరుల శాఖ ముఖ్య కార్యదర్శి జి.సాయిప్రసాద్ సంబంధిత పనుల కోసం రూ.126.06 కోట్లు మంజూరు చేస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. 'నా ఎన్నికల హామీని నెరవేర్చేందుకు సాయం చేసిన సీఎం చంద్రబాబు, మంత్రులు నారా లోకేశ్, నిమ్మల రామానాయుడుకు కృతజ్ఞతలు చెబుతున్నా' అని బుధవారం రాత్రి ఎమ్మెల్యే పులివర్తి నానీ ఆంధ్రజ్యోతితో అన్నారు.

రేషన్ పంపిణీ నేటి వరకు పొడిగింపు

చిత్తూరు కలెక్టరేట్, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): రేషన్ కార్డుదారులకు ఈనెల 1 నుంచి చౌకదుకాణాల ద్వారా ప్రారంభమైన నిత్యావసర సరుకుల పంపిణీ గడువును ప్రభుత్వం గురువారం వరకు పొడిగించినట్లు డీఎస్వో శంకరన్ తెలిపారు. బుధవారంతో ముగించాల్సిన గడువును బియ్యం పంపిణీలో ఆలస్యం జరగడంతో ఒకరోజు గడువు పెంచినట్లు ఆయన పేర్కొన్నారు.

రేపు డీవీఎంసీ సమావేశం

చిత్తూరు అర్బన్, అక్టోబరు 15(ఆంధ్రజ్యోతి): జిల్లా విజిలెన్స్ మానిటరింగ్ కమిటీ సమావేశం (డీవీఎంసీ) శుక్రవారం కలెక్టరేట్‌లో జరుగుతుందని సాంఘిక సంక్షేమాధికారి విక్రమ్‌కుమార్‌రెడ్డి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 10గంటలకు జరిగే ఈ సమావేశం కలెక్టర్ సుమిత్‌కుమార్ అధ్యక్షతన జరుగుతుందన్నారు. సమావేశానికి డీవీఎంసీ సభ్యులు, సంబంధిత శాఖల అధికారులు తప్పక హాజరుకావాలని ఆయన కోరారు.

మామిడి సబ్సిడీపై సందేహాలకు టోల్‌ఫ్రీ నెంబరు 08572 - 242777

చిత్తూరు కలెక్టరేట్, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): మామిడి రైతులకు అందించిన సబ్సిడీ మొత్తాలపై సందేహాలు ఉంటే టోల్‌ఫ్రీ నెంబరు 08572-242777కు సంప్రదించాలని కలెక్టర్ సుమిత్‌కుమార్ తెలిపారు. మామిడి రైతులకు ప్రభుత్వం కిలోకు రూ.4 చొప్పున ఉమ్మడి చిత్తూరు జిల్లాకు చెందిన 37,881 మంది మామిడి రైతుల ఖాతాల్లో రూ.172.84 కోట్లు జమచేసిందన్నారు. అర్హత ఉన్నా నగదు జమ కాని రైతులు ఈనెల 30 లోగా ఆ మండల రైతు సేవాకేంద్రాలు, ఉద్యానశాఖ కార్యాలయాల్లో అర్జీలందిస్తే 48 గంటల్లో పరిష్కరిస్తామని ఆయన పేర్కొన్నారు.



ములకలచెరువులో కల్తీ మద్యం తీగ లాగితే.. రాష్ట్ర మంతా కదిలింది. దీనిపై ప్రభుత్వం సిట్‌నూ వేసింది. అదే సమయంలో నకిలీ మద్యం గుట్టు విప్పడానికి ప్రభుత్వం యాప్‌ను అందుబాటులోకి తెచ్చింది. బాటిల్‌పై క్యూఆర్ కోడ్‌ను స్కాన్ చేయడం ద్వారా అసలా.. నకిలీనా అనేది గుర్తించొచ్చు.

- చిత్తూరు సిటీ, ఆంధ్రజ్యోతి

ఇక రట్టు



● స్కాన్ చేయి.. వివరాలు తెలుసుకో

● అందుబాటులోకి ఏపీ ఎక్సైజ్ సురక్షా యాప్

కల్తీ మద్యం గుట్టు రట్టు చేయడానికి ప్రభుత్వం 'ఏపీ ఎక్సైజ్ సురక్షా యాప్'ను తీసుకొచ్చింది.చిత్తూరు అర్బన్ ఎక్సైజ్ స్టేషన్‌లో బుధవారం ఎక్సైజ్ సూపరింటెండెంట్ శ్రీనివాస్, సీఐ శ్రీహరి రెడ్డి తదితరులతో కలిసి ఎక్సైజ్ డీసీ విజయ్ శేఖర్ ఈ యాప్‌ను ఆవిష్కరించారు. అనంతరం ఎలా ఉపయోగించాలనే దానిపై అవగాహన కల్పించారు. కల్తీ మద్యం అరికట్టేందుకు.. మరోవైపు లిక్కర్ షాపులు, బార్ల వద్ద నాణ్యమైన మద్యం విక్రయాలకు ఈ యాప్ దోహదపడనుంది. మద్యం బాటిల్ మీద వున్న క్యూఆర్ కోడ్ స్కాన్ చేసిన తర్వాతనే మద్యం విక్రయించాలి.

యాప్‌ను ఇలా వాడాలి

● సెల్‌ఫోనులోని ప్లే స్టోర్‌కు వెళ్ళి 'ఏపీ ఎక్సైజ్ సురక్షా యాప్'ను డౌన్‌లోడ్ చేసుకోవాలి. ● ఇన్‌స్టాల్ చేశాక రెండు ఎంపికలు కనిపిస్తాయి. ఒకటి వినియోగదారుల కోసం, మరొకటి మద్యం దుకాణాల నిర్వాహకుల కోసం. ● వినియోగదారుడు ఐఎంఎల్ లిక్కర్ బాటిల్‌పై వున్న క్యూఆర్ కోడ్ స్కాన్ చేయాలి. ఆ తర్వాత వెరిఫై ప్రొడక్టును ఎంపిక చేయగానే మద్యం బాటిల్‌పై ఉన్న బ్యాచ్ నెంబరు, ఎక్కడ తయారైంది? ఎటు నుంచి వచ్చింది? బ్రాండు పేరు, ధర వివరాలన్నీ స్క్రీన్‌పై డిస్‌ప్లే అవుతుంది. ఒకవేళ అది నకిలీ మద్యం అయితే 'డిటైల్స్ నాట్ ఫౌండ్' అని కనిపిస్తుంది. ● ఈ యాప్‌లోని సమాచారం జిల్లా బృందంలోని అధికారులకు, రాష్ట్ర స్థాయి అధికారుల డేటా బేస్‌కు వెళుతుంది.



ఇక, అబద్ధ ప్రచారం చేయలేరు

ఇకపై మద్యం దుకాణాల్లో నకిలీ మద్యం ఉందనే అపోహాలు, వదంతులు సృష్టించలేరు. ప్రభుత్వం, డిపార్టుమెంటుపై అబద్ధాలు ప్రచారం చేసే అవకాశాలు ఉండవు. ఈ యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకుని అసలు మద్యం కొనుగోలు చేయాలి. ఎవరైనా సోషల్ మీడియా ద్వారా తప్పుడు ప్రచారం చేస్తే మాత్రం కఠిన చర్యలు తప్పవు.

- ఎక్సైజ్ డీసీ విజయ్ శేఖర్

ఎముకలు దొరికాయి

● బయటపడిన గుణశీలన్ శరీర భాగాలు



గుణశీలన్ శవం కోసం చెరువులో గాలిస్తున్న అగ్నిమాపక సిబ్బంది

నగరి, అక్టోబర్15 (ఆంధ్ర జ్యోతి): నగరి మున్సిపాలిటీ పరిధిలోని కొత్తపేటకు చెందిన గుణశీలన్(65) శరీర అవశేషాలను పోలీసులు బుధవారం వెలికి తీశారు. బీమా సొమ్ము కోసం గంగాధరం, అయ్యప్పన్ జూన్4వ తేదీన గుణశీలన్‌ను హత మార్చిన విషయం తెలిసిందే. తిరుత్తణి పోలీసులు బుధవారం ఉదయం నగరి అగ్నిమాపక సిబ్బంది సహాయంతో సుమారు10 గంటలు వెతికారు. కొన్ని శరీర భాగాలను గుర్తించగలిగారు. గుణశీలన్‌ను హత్య చేశాక విడివిడిగా శరీరభాగాలను నరికి గోనెసంచిలో కట్టి చెరువులో పడేయడంతో ఎముకలు మాత్రం లభ్యమయ్యాయి. మొండెం కనిపించినా తల కనిపించలేదు. దొరికిన శరీర అవశేషాలను తిరుపతి ఎస్వీ మెడికల్ కళాశాల ఫోరెన్సిక్ నిపుణులు పరీక్షించారు. హైకోర్టుకు వెళ్లడంతో కేసు ఛేదించారని, ఎముకలు మాత్రమే కనిపించాయని మృతుడి కుమార్తె సంగీత ఆవేదన వ్యక్తం చేశారు.తిరువళ్లూరు డీఎస్పీ కందన్ నగరి ఏరియా వైద్యశాల వద్ద పోస్టుమార్టం చేయించారు.నిందితులను తమిళ పోలీసులు తిరుత్తణికి తీసుకెళ్లారు.



నిందితులు అయ్యప్పన్ - గంగాధరం

నేడు జడ్పీ స్టాండింగ్ కమిటీ సమావేశం

చిత్తూరు రూరల్, అక్టోబరు 15(ఆంధ్రజ్యోతి): జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో గురువారం జడ్పీ స్టాండింగ్ కమిటీ సమావేశం నిర్వహించనున్నట్లు సీఈవో రవికుమార్ నాయుడు తెలిపారు. ఉదయం 10 గంటలకు ప్రారంభమయ్యే సమావేశానికి జిల్లా స్థాయి అధికారులందరూ పాల్గొనాలని కోరారు.

గానకోకిల బాలసరస్వతి జ్ఞాపకాల్లో....



హైదరాబాదులో బుధవారం కన్నుమూసిన తొలి తరం సినీ నటి, నేపథ్య గాయని రావు బాలసరస్వతికి తిరుపతితో మంచి అనుబంధమే వుంది.చెన్నైలో వున్నప్పుడు అనేకమార్లు తిరుపతికి వచ్చి శ్రీవారిని దర్శించుకున్నారు.వేంకటేశ్వర స్వామిని స్తుతిస్తూ అనేక పాటలు పాడారు.వెంకటగిరి రాజవంశంలో పుట్టి తూర్పుగోదావరి జిల్లా కోలంక జమిందారు ఇంటికి దత్తు వెళ్లిన రావు ప్రద్యుమ్న కృష్ణ మహీపతి సూర్యారావును 1944వ సంవత్సరంలో వివాహమాడారు.2007లో తిరుపతిలో నిర్వహించిన తెలుగు భాషా బ్రహ్మోత్సవాలతో పాటు 2009లో శ్రీకాళహస్తి ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో జరిగిన కార్యక్రమానికి హాజరై సన్మానాలందుకున్నారు.రావు బాలసరస్వతి మృతి పట్ల వెంకటగిరి రాజ వంశీకుడు, గేయధారతో ప్రఖ్యాతుడైన సాయికృష్ణ యాచేంద్ర సంతాపం వ్యక్తం చేశారు.1950వ సంవత్సరంలో వెంకటగిరిలో జరిగిన తన గేయధార కార్యక్రమానికి ఆమె హాజరయ్యారని గుర్తు చేసుకున్నారు.

- తిరుపతి(విశ్వవిద్యాలయాలు),ఆంధ్రజ్యోతి



శ్రీకాళహస్తి డిగ్రీ కళాశాలలో రావు బాలసరస్వతిని సన్మానిస్తున్న నాటి తెలుగు అధ్యాపకుడు సాకం నాగరాజ



తిరుపతిలో నిర్వహించిన తెలుగు భాషా బ్రహ్మోత్సవాల్లో రావు బాలసరస్వతి

కలాం ఆదర్శంగా ఉన్నత స్థితికి ఎదగాలి



పుంగనూరు: అబ్దుల్ కలాంకు నివాళులర్పిస్తున్న బీజేపీ నాయకులు



కుప్పంలో నివాళులర్పిస్తున్న బీసీఎన్ తదితరులు

కుప్పం, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): భారత మాజీ రాష్ట్రపతి, మిసైల్ మ్యాన్ డాక్టర్ అబ్దుల్ కలాం జీవితం ఆదర్శం విద్యార్థులు ఉన్నత స్థాయికి ఎదగాలని బీసీఎన్ విద్యా సంస్థల చైర్మన్ బీసీ.నాగరాజ్ అన్నారు. కుప్పం ఇంజనీరింగ్ కళాశాలలో బుధవారం డాక్టర్ ఏపీజే.అబ్దుల్ కలాం జయంతిని ఘనంగా నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పేదరికం నుంచి అసమానంగా ఎదిగిన అబ్దుల్ కలాం, విలువలు, ఉన్నత లక్ష్యాలతో కూడిన జీవితం గడిపారన్నారు. ఉన్నతమైన కలలు కనడమే కాక, వాటిని సాకారం చేసుకోవడంలో ఆయన చేసిన పరిశ్రమ విద్యార్థులకు ఆదర్శం కావాలని పిలుపునిచ్చారు. ఆయన ప్రేరణతో ముందుకు సాగాలన్నారు. కార్యకరమంలో కుప్పం ఇంజనీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ ఎస్. సుధాకర్ బాబు, వైస్ ప్రిన్సిపాల్ ఎస్.భాస్కరన్, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రామ్ ఆఫీసర్ జె.మాధవన్, గంగాధర్, అధ్యాపకులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

● **పుంగనూరు:** మాజీ రాష్ట్రపతి, శాస్త్రవేత్త ఏపీజే అబ్దుల్ కలాం ఆశయాలను ముందుకు తీసుకెళ్లడానికి ప్రతిఒక్కరూ కృషి చేయాలని బీజేపీ జాతీయ నాయకుడు చల్లపల్లి నరసింహారెడ్డి పిలుపునిచ్చారు. బుధవారం పుంగనూరు ఎంసీవీ డిగ్రీ కళాశాలలో అబ్దుల్‌కలాం జయంతిని ఘనంగా నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. స్థానిక ఏపీజే అబ్దుల్ కలాం చారిటబుల్ ట్రస్ట్ అధ్యక్షుడు పి.అయూబ్‌ఖాన్ మాట్లాడుతూ పుంగనూరులో కలాం ట్రస్టుతో అనేక సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని, త్వరలో ఆయన విగ్రహం ఏర్పాటు చేయనున్నట్లు వివరించారు. మదనపల్లె విజయభారతి స్కూల్ కరస్పాండెంట్ ఎన్.సేతు నల్లుస్వామి, ట్రస్టు కార్యదర్శి నరసింహులు, విశ్రాంత డీఎస్పీ సుకుమార్‌బాబు, రాయలసీమ చిల్డ్రన్స్ అకాడమి పాఠశాల డైరెక్టర్ చంద్రమోహన్‌రెడ్డి, ఎస్ఐ వెంకటరమణ, ఏఎస్ఐ అశ్వర్థనారాయణ, మాజీ కౌన్సిలర్ కృపాకర్, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.



చౌడేపల్లె ప్రాథమిక పాఠశాలలో...

● **చౌడేపల్లె :** అబ్దుల్ కలాం జయంతి వేడుకలను బుధవారం స్థానిక ఎంపీపీ స్కూల్‌లో జరుపుకున్నారు. కలాం చిత్రపటానికి నివాళులు అర్పించారు.

అర్హులందరికీ సంక్షేమ ఫలాలు



సమావేశంలో మాట్లాడుతున్న మునస్వామి

రామకుప్పం, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): అర్హులైన పేదలందరికీ సంక్షేమ ఫలాలు అందేలా పార్టీ శ్రేణులు కృషి చేయాలని గ్రంథాలయ పరిషత్ రాష్ట్ర డైరెక్టరు మునస్వామి, బీసీసెల్ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి పత్ర నారాయణాచారి, టీడీపీ మండల అధ్యక్షుడు వెంకటరమణ, మాజీ అధ్యక్షులు ఆంజనేయరెడ్డి, ఆనందరెడ్డి కోరారు. బుధవారం రామకుప్పంలో జరిగిన పార్టీ మండల ముఖ్యనేతల సమావేశంలో వారు మాట్లాడుతూ సంక్షేమ ఫలాలు అందించే విషయంలో వైసీపీ పాలకులు వివక్ష పాటించారన్నారు. ప్రస్తుతం వివక్షతకు తావులేకుండా అర్హులకు సంక్షేమ ఫలాలు అందించాలన్నదే సీఎం చంద్రబాబు ధ్యేయమన్నారు. సమావేశంలో తెలుగు రైతు నియోజకవర్గ అధ్యక్షుడు చలపతి, ఏఎంసీ మాజీ వైస్‌చైర్మన్ సీతాపతి, మాజీ వైస్‌ఎంపీపీ చిన్నికృష్ణ, ఎస్టీసెల్ జిల్లా అధ్యక్షుడు కృష్ణానాయక్, రెస్కో వైస్‌చైర్మన్ విశ్వనాథ్, సింగిల్‌విండో అధ్యక్షుడు మహ్మద్‌రఫీ, పార్టీ, తెలుగు యువత మండల ప్రధాన కార్యదర్శులు నరసింహులు, వెంకటాచలం, రెస్కో డైరెక్టర్లు విజయ్‌కుమార్, సతీష్, మనోహర్ ఏఎంసీ డైరెక్టరు మునీంద్రనాయక్, క్లస్టర్ ఇన్‌చార్జీలు రవిరెడ్డి, నాగభూషణం, కో-ఇన్‌చార్జీలు కామరాజనాయక్, నవీన్, నేతలు రామ్మూర్తి, గంట్లప్పగౌడు, గుర్రప్ప, జేయి, రామకృష్ణప్ప, లోకేష్, మురళీ, నియాజ్, బాలరాజు, సుబ్రీ, చంద్రశేఖర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఈ-పంట నమోదు వేగవంతం చేయండి



మాట్లాడుతున్న ఏడీఏ శివకుమార్

సోమల, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): రైతులు పండించిన పంటలను తప్పనిసరిగా ఈ క్రాప్ నమోదు చేయించాలని పుంగనూరు ఏడీఏ శివకుమార్ తెలిపారు. బుధవారం స్థానిక రెవెన్యూ కార్యాలయంలో జరిగిన వీఆర్వోల సమావేశంలో ఆయన మాట్లాడారు. తహసీల్దార్ మధుసూదన్ మాట్లాడుతూ సరైన తూకాలతో డీలర్లు రేషన్ బియ్యం సరఫరా చేయాలని ఆదేశించారు. సమావేశంలో ఏవో సుధాకర్, వీర్వోలు, డీలర్లు పాల్గొన్నారు.

● **పెద్దపంజాణి:** ఈ-పంట నమోదు కార్యక్రమాన్ని వేగవంతం చేయాలని ఎంపీడీవో బాలాజీ, తహసీల్దారు హనుమంతు సచివాలయ సిబ్బందికి సూచించారు. బుధవారం మండలంలోని అమ్మరాజుపల్లె, లింగాపురం, అప్పినపల్లె సచివాలయాలను సందర్శించారు.

కుప్పంలో పాడి రైతులకు మంచి రోజులు



పాడి రైతులకు అవగాహన కల్పిస్తున్న అధికారులు, పీఎస్ఎం తదితరులు

కుప్పం, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): కుప్పం నియోజకవర్గంలో పాడి రైతులకు మంచి రోజులు వచ్చాయని ఆర్టీసీ వైస్ చైర్మన్ పీఎస్.మునిరత్నం అన్నారు. కుప్పం మండలం గిడ్డేగానిపెంట గ్రామంలో బుధవారం ఆంధ్రప్రదేశ్ పశుసంవర్ధక శాఖ, పశుగణాభివృద్ధి సంస్థ, రాష్ట్రీయ గోకుల్ మిషన్ సంయుక్త నిర్వహణలో పాడి రైతుల అవగాహన సదస్సు నిర్వహించారు. స్థానికంగా ఉన్న రైతుల ఇళ్లకు వెళ్లి గోవులకు సంబంధించిన గర్భకోశ వ్యాధులు, ఇతర వ్యాధులు, నివారణ, చికిత్స అనే అంశాల గురించి అవగాహన కలిగించారు. అవసరమైన పశువులకు చికిత్సలు చేశారు. అనంతరం జరిగిన సమావేశంలో పీఎస్ఎం మాట్లాడుతూ కుప్పంలో పాడి రైతులతో ఎంత పాడి ఉత్పత్తి జరిగినా, అంతటినీ స్థానికంగానే మార్కెటింగ్ చేసుకునే సదుపాయాలనుముఖ్యమంత్రి చంద్రబాబు కల్పిస్తున్నారన్నారు. సంబంధిత పరిశ్రమలను స్థానికంగానే నెలకొల్పుతున్నామని, ఇప్పటికే ఆయా సంస్థలకు భూమిని కేటాయించామని చెప్పారు. పరిశ్రమలు త్వరలోనే ఏర్పాటై ప్రారంభమవుతాయని తెలిపారు. భవిష్యత్తులో పాలకు డిమాండ్ ఏర్పడి రైతులకు మంచి ధర, అధిక లాభాలు వస్తాయన్నారు. కార్యక్రమంలో ఆయా శాఖల అధికారులు, సిబ్బంది, పాడి రైతులు తదితరులు పాల్గొన్నారు.

17న కబడ్డీ పోటీలు

చౌడేపల్లె, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): ఈనెల 17న ఎస్‌జీఎఫ్ఐ క్రీడల్లో భాగంగా అండర్-14, 17 బాల, బాలికల కబడ్డీ పోటీలు నిర్వహించనున్నట్లు చారాల హెచ్ఎం రేణుక పేర్కొన్నారు. బుధవారం ఆమె మాట్లాడుతూ మండలంలోని చారాల హైస్కూల్‌లో క్రీడా పోటీలు నిర్వహించనున్నట్లు తెలిపారు. పలమనేరు డివిజన్ పరిధిలోని 10 మండలాల్లోని బాల, బాలికలు పాల్గొనవచ్చని, 44 జట్ల క్రీడాకారులు పాల్గొననున్నట్లు పేర్కొన్నారు.

ప్రకృతి వ్యవసాయంతో అధిక దిగుబడులు



పంటలను పరిశీలిస్తున్న అనంతపురం రైతులు

పుంగనూరు రూరల్, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): ప్రకృతి వ్యవసాయంతో పండించిన పంటలతో తయారు చేసిన ఆహారాన్ని తినడంతో ఆరోగ్యంగా జీవించగలరని రైతు సాధికారిసంస్థ జిల్లా ప్రాజెక్టు మేనేజర్ జీ.వాసు పేర్కొన్నారు. బుధవారం పుంగనూరు మండలం భీమగానిపల్లెకి చెందిన ఎం.ప్రకాశ్‌రెడ్డి సాఫ్ట్‌వేర్ ఇంజనీరు ఉద్యోగాన్ని వదలి బోనేపల్లె సమీపంలో 20 ఎకరాల్లో ప్రకృతి వ్యవసాయం, పశువులు, గొర్రెలు, మేకలు, కోళ్ల పెంపకం చేపట్టారు. ప్రకాశ్‌రెడ్డి నిర్వహిస్తున్న ప్రకృతి వ్యవసాయ క్షేత్రాన్ని సత్యసాయి జిల్లా తనకల్లు జనజాగృతి ఎన్జీవో, రైతు సాధికారిక సంస్థ ఆధ్వర్యంలో 58 మంది రైతులు, 8 మంది అధికారులు ప్రకృతి వ్యవసాయాన్ని పరిశీలించారు. వరి వంగడాల రకాలు, అరటి, వక్క, చిలగడదుంప, కొబ్బరి, మామిడి, రాగి, కోళ్ల, గొర్రెలు, వివిధ రకాల 60 ఆవులు పెంపకం, పాల ఉత్పత్తి, సాగు విధానం, దిగుబడి తదితర అంశాలపై రైతులు ఆరా తీశారు. రైతుసాధికార సంస్థ ప్రతినిధులు డాక్టర్ కె. పుష్ప, రెడ్డికుమారి , యశ్వంత్, జనజాగృతి ప్రతినిధులు శ్రీనివాసులురెడ్డి, గరుడప్ప, గంగాధర్‌రెడ్డి పాల్గొన్నారు.

ముఖ్యమంత్రి కృషితోనే సాగునీరు



బైపరెడ్లపల్లె చెరువు మొరవ వద్ద పూజల్లో టీడీపీ నేతలు

రామకుప్పం, అక్టోబరు 15(ఆంధ్రజ్యోతి): చంద్రబాబు భగీరథ ప్రయత్నంతో కుప్పం నియోజకవర్గంలో వేధిస్తున్న సాగు, తాగునీటి కష్టాలకు తెరపడుతోందని తెలుగురైతు నియోజకవర్గ అధ్యక్షుడు చలపతి, టీడీపీ మండల అధ్యక్షుడు వెంకటరమణ, మాజీ అధ్యక్షులు ఆంజనేయరెడ్డి, ఆనందరెడ్డి, మాజీ వైస్‌ఎంపీపీ చిన్నికృష్ణ తెలిపారు. హంద్రీ-నీవా కాలువతో రామకుప్పం మండలం బైపరెడ్లపల్లె చెరువు నిండి మొరవపోతోంది. బుధవారం టీడీపీ శ్రేణుల ఆధ్వర్యంలో మొరవ వద్ద జలహారతి పూజలు చేశారు. కార్యక్రమంలో బీసీసెల్ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి పత్ర నారాయణాచారి, ఎస్టీసెల్ జిల్లా అధ్యక్షుడు కృష్ణానాయక్, రెస్కో వైస్‌చైర్మన్ విశ్వనాథ్, సింగిల్‌విండో అధ్యక్షుడు మహ్మద్‌రఫీ, పార్టీ, తెలుగుయువత మండల ప్రధాన కార్యదర్శులు నరసింహులు, వెంకటాచలం, రెస్కో డైరెక్టర్లు విజయ్‌కుమార్, సతీష్, మనోహర్ ఏఎంసీ డైరెక్టరు మునీంద్రనాయక్, క్లస్టర్ ఇన్‌చార్జీ, కో-ఇన్‌చార్జీలు రవిరెడ్డి, నవీన్, మాజీ సర్పంచులు వెంకటేశ్, రామకృష్ణప్ప, నేతలు కామరాజనాయక్, నరేంద్రరెడ్డి, రెడ్డిపురుషోత్తం, జ్ఞానశేఖర్‌రెడ్డి, మంజునాథరెడ్డి, పద్మనాభరెడ్డి, నియాజ్, బాలరాజు, సుబ్రీ, మురళీ, సురేష్, బాలకృష్ణ, శ్రీరాములు తదితరులు పాల్గొన్నారు.

ఆరోగ్యకర జీవనమే ప్రభుత్వ ధ్యేయం



రామకుప్పం, అక్టోబరు 15(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో ప్రతి ఒక్కరూ ఆరోగ్యవంత జీవనం సాగించాలన్నదే సీఎం చంద్రబాబు నేతృత్వంలోని రాష్ట్ర ప్రభుత్వ ధ్యేయమని టీడీపీ రామకుప్పం మండల మాజీ అధ్యక్షుడు ఆనందరెడ్డి తెలిపారు. బుధవారం మండల పరిధి బిరుగుండ్లపల్లె గ్రామంలో ఉచిత రక్తపరీక్షా శిబిరాన్ని ఆయన ప్రారంభించారు. కార్యక్రమంలో మాజీ సర్పంచు పెరుమాళ్, నేతలు రఘునాథరెడ్డి, విశ్వనాథ్, బాలు తదితరులు పాల్గొన్నారు.

సమతుల్య ఆహారంతోనే ఆరోగ్యం సాధ్యం



సంజీవని కిట్లను అందజేస్తున్న సీడీపీవో వాణిశ్రీదేవి

సదుం, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): సమతుల్యత ఆహారంతోనే ఆరోగ్యం అని ఐసీడీఎస్ సీడీపీవో వాణిశ్రీదేవి సూచించారు. పోషకాహార మాసోత్సవాల్లో భాగంగా బుధవారం మండలంలోని ఊటుపల్లె పంచాయతీ చింతతలవారిపల్లెలో పోషకాహార విలువలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా గర్భిణులు, బాలింతలు, తల్లులు తీసుకోవాల్సిన పోషకాహారాల స్టాళ్లను ఏర్పాటు చేసి వాటి తయారీ విధానాన్ని వివరించారు. బాలింతలకు సంజీవని కిట్లను పంపిణీ చేశారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్ మల్లీశ్వరి, అంగన్‌వాడీ టీచర్లు పాల్గొన్నారు.

వైద్యులు మరింత బాధ్యతతో పనిచేయాలి

పలమనేరు, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): పలమనేరు ఏరియా ఆస్పత్రిలో వైద్యులు, సిబ్బంది మరింత బాధ్యతతో పని చేయాలని పలమనేరు ఎమ్మెల్యే అమరనాథరెడ్డి సూచించారు. పలమనేరు ప్రభుత్వాస్పత్రిలో రోగులకు అందిస్తున్న సేవలకుగాను జిల్లా స్థాయిలో అవార్డు లభించింది. దీంతో ఆస్పత్రి సూపరింటెండెంట్ మమతారాణి, ఆసుపత్రి అభివృద్ధి కమిటీ సభ్యులు ఎం.నాగరాజు, సుధాకర్‌రెడ్డి బుధవారం పలమనేరు టీడీపీ కార్యాలయంలో ఎమ్మెల్యేను కలిశారు. వైద్యులు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

పోరంబోకు భూమిని ఆక్రమిస్తే చర్యలు



ఆక్రమిత చెరువు పోరంబోకు భూమిలో బోర్డు ఏర్పాటు చేస్తున్న తహసీల్దారు శివయ్య

రామకుప్పం/శాంతిపురం, అక్టోబరు 15(ఆంధ్రజ్యోతి): శాంతిపురం మండలం ఆరిముత్తనపల్లెలో చెరువు పోరంబోకు భూమిని ఆక్రమించుకున్న వారిపై చట్టప్రకారం చర్యలు తీసుకుంటామని తహసీల్దారు శివయ్య తెలిపారు. బుధవారం ఆరిముత్తనపల్లెలో ఆయన తమ సిబ్బందితో కలిసి చెరువు పోరంబోకు భూమిని సర్వే చేయించగా 1.08 ఎకరాల భూమి ఆక్రమణకు గురైనట్లు గుర్తించారు. చెరువు పోరంబోకు భూములకు హద్దులు నిర్ధారించి బోర్డు ఏర్పాటు చేశారు. చెరువు పోరంబోకు భూములను ఆక్రమిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.

సమన్వయ కృషితోనే అవార్డు



సర్పంచి జయప్ప, పంచాయతీ కార్యదర్శి స్వాతిలను సన్మానిస్తున్న అధికారులు, నేతలు

రామకుప్పం/శాంతిపురం, అక్టోబరు 15(ఆంధ్రజ్యోతి): శాంతిపురం మండలం కెనమాకులపల్లె పంచాయతీ రాష్ట్ర స్థాయిలో ఉత్తమ స్వచ్ఛ పంచాయతీగా ఎంపికైన విషయం తెలిసిందే. ఉత్తమ పంచాయతీగా ఎంపికైన సందర్భాన్ని పురస్కరించుకుని బుధవారం ఎంపీడీవో కుమార్ ఆధ్వర్యంలో సర్పంచి జయప్ప, కార్యదర్శి స్వాతిలను అధికారులు, నేతలు ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో టీడీపీ మండల, మాజీ అధ్యక్షులు ఉదయ్‌కుమార్, విశ్వనాథనాయుడు, క్లస్టర్ ఇన్‌చార్జి రాజేంద్రప్రసాద్, సీనియర్ నేతలు చంద్రశేఖర్, శివశంకర్, కేదారనాథ్, నేతలు శివ, మంజునాథ్, నాగరాజు, రమేష్, రాధాకృష్ణప్ప, కోదండప్ప, జయరెడ్డి, రవి తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే అమరనాథరెడ్డికి సన్మానం



ఎమ్మెల్యే అమరనాథరెడ్డిని సన్మానిస్తున్న రెస్కో డైరెక్టర్ చంద్రశేఖర్‌రెడ్డి తదితరులు

పలమనేరు, అక్టోబరు15 (ఆంధ్రజ్యోతి) : పలమనేరు టీడీపీ కార్యాలయంలో బుధవారం ఎమ్మెల్యే అమరనాథరెడ్డిని రెస్కో డైరెక్టర్‌గా నియమితులైన చంద్రశేఖర్‌రెడ్డి వి.కోట మండల టీడీపీ నాయకులతో కలిసి సన్మానించారు. వి.కోట మండలం చింతల ఎల్లాగరం గ్రామానికి చెందిన చంద్రశేఖర్‌రెడ్డిని ప్రభుత్వం రెస్కో డైరెక్టర్‌గా నియమించింది. దీంతో తన పదవికి సహకరించిన ఎమ్మెల్యే అమరనాథరెడ్డిని మర్యాదపూర్వకంగా కలిసి సన్మానించారు. గతంలోనే చంద్రశేఖర్‌రెడ్డి రెస్కో డైరెక్టర్‌గా పనిచేసిన అనుభవం ఉండటంతో రైతుల సమస్యలు పరిష్కరించేందుకు చొరవచూపాలని ఎమ్మెల్యే అమరనాథరెడ్డి సూచించారు. కార్యక్రమంలో వి.కోట మండల టీడీపీ నాయకులు రామచంద్రనాయుడు, రంగనాథ్, రాంబాబు, సోమశేఖర్, సతీష్, లక్ష్మన్, మురుగేష్, జనార్థన్, కేశవ్ పాల్గొన్నారు.

కేశవరెడ్డి సేవలు అభినందనీయం



సోమలలో ఎంఈవోను సన్మానిస్తున్న ఉపాధ్యాయులు

సోమల, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): సోమల ఎంఈవోగా కేశవరెడ్డి పనిచేస్తూ చౌడేపల్లెకు బదిలీపై వెళ్లిన ఆయన్ను బుధవారం స్థానిక మండల విద్యావనరుల కేంద్రంలో ఘనంగా సన్మానించారు. ఎంఈవోలు విజయకుమారి, శివరత్న, ఉపాధ్యాయ సంఘ నేతలు ప్రసాద్, ఎస్వీ రమణ, భాస్కర్, రామ్మోహన్, చెన్నకేశవులు, శ్రీనివాసులు, ఇమ్రాన్, జయప్రకాశ్, హరీశ్, రమణయ్య, సురేశ్, సోమశేఖర్, వసంత్, అస్లాం, లావణ్య, నారాయణ పాల్గొన్నారు.

క్షయ రహిత సమాజ స్థాపనే లక్ష్యం



రోగులకు దినుసులు అందిస్తున్న వైద్యులు

వి.కోట, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): క్షయ రహిత సమాజ స్థాపనే లక్ష్యంగా ప్రతి ఒక్కరూ కృషి చేయాలని వి.కోట సీహెచ్‌సీ వైద్యాధికారి మురళీ అన్నారు. టీబీ ముక్త భారత్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా వి.కోట ప్రభుత్వాస్పత్రిలో ప్రజలకు అవగాహ న కార్యక్రమం నిర్వహించారు. క్షయ వ్యాధిని ప్రాథమిక దశలో గుర్తించడంతో సులువుగా నయం చేయవచ్చన్నారు. ఈ సందర్భంగా క్షయ వ్యాధిగ్రస్తులు తీసుకోవాల్సిన సమతుల్యమైన ఆహారంపై వైద్యులు వివరించారు. అలాగే జిల్లా కలెక్టర్ సుమిత్‌కుమార్ సాయంతో 13 మంది రోగులకు ఆహార దినుసుల కిట్‌ను అందించారు. కార్యక్రమంలో డా.కిరణ్, డా.సల్మా, టీబీ సూపర్‌వైజర్ హరిప్రసాద్, సిబ్బంది పాల్గొన్నారు.

శివపార్వతుల కల్యాణ మండపానికి విరాళాలు



విరాళం అందజేస్తున్న దాతలు

సోమల, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): సోమల పట్టణంలో కొలువుదీరిన స్వయంభే శ్వర స్వామి ఆలయం ఆవరణలో శివపార్వతుల కల్యాణ మండప నిర్మాణానికి పలువురు దాతలు విరాళం అందజేసినట్లు ఆలయ ధర్మకర్త సోమశేఖర్ తెలిపారు. బుధవారం స్థానిక ఆలయంలో పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ఈక్రమంలోనే సోమలకు చెందిన శెట్టివారి నాగరాజ భార్య దీప జ్ఞాపకార్థం రూ.10,116, తాళ్లపాక పద్మనాభరావు, సుబ్బరత్నంల జ్ఞాపకార్థం వారి కుమారులు రూ. 10,116, కామిశెట్టి ప్రమీళ, శ్రీనివాసులు దంపతులు విరాళం అందజేశారు. కార్యక్రమంలో సీజీ రెడ్డెప్ప, లింగయ్య, ఆలయ అర్చకులు విద్యాసాగర్ తదితరులు పాల్గొన్నారు.

ప్రకృతి వ్యవసాయంతో ఆరోగ్యకర పంటలు



చౌడేపల్లె, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): ప్రకృతి వ్యవ సాయంతో భూసారం పెరడంతోపాటు అధిక దిగుబడులు, ఆరోగ్యకర పంటలు సాధ్యమని డీపీఎం వాసు అన్నారు. బుధవారం సత్యసాయి జిల్లా జన జాగృతి సభ్యుల బృందం మండలంలోని చిన్న ఓబునపల్లెలో చేపడుతున్న ప్రకృతి వ్యవసాయాన్ని సందర్శించారు. రసాయన ఎరువులకు స్వస్తి పలికి రైతులు సేంద్రియ పంటలసాగుపై దృష్టి సారించాలని కోరారు. కార్యక్రమంలో ఎంటీ రెడ్డికుమారి, పుష్పలత, అరుణ, సీఆర్పీలు పాల్గొన్నారు.

పాఠశాలకు టీవీ వితరణ



పాఠశాలకు టీవీ వితరణ చేస్తున్న ఉపాధ్యాయుడు

రొంపిచెర్ల, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): రొంపిచెర్ల ఉర్దూ పాఠశాలలో పనిచేస్తున్న ఎల్లలచెరువు ఇర్ఫాన్ అలీ అదే పాఠశాల విద్యార్థుల కోసం బుధవారం ఎల్ఈడీ టీవీని వితరణగా అందించారు. కార్యక్రమంలో డీవైఈవో ఇందిర, ఎంఈవో శ్రీనివాసులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయురాలికి నేతల సత్కారం



రామకుప్పం, అక్టోబరు 15(ఆంధ్రజ్యోతి): రామకుప్పం మండలం గెర్నిపల్లె గ్రామంలోని ప్రాథమిక పాఠశాలలో నూతన ఉపాధ్యాయురాలు కీర్తి చేరడంతో ఆమెను స్థానిక నేతలు శాలువ, పూలమాలతో సత్కరించారు. పాఠశాలలో 35మంది విద్యార్థులకు అందుబాటులో ఉంటూ పిల్లల భవిష్యత్తుకు కృషి చేయాలని కోరారు. టీడీపీ మైనారిటీ సెల్ మండల ఉపాధ్యక్షుడు సలాం, ఎస్ఎంసీ చైర్మన్ యారబ్, సుధాకర్‌రెడ్డి, బాబు, రఫీ పాల్గొన్నారు.

చేతుల పరిశుభ్రతతో ఆరోగ్యం

పెద్దపంజాణి, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): మండలంలోని నిడిగుంట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ప్రపంచ చేతుల పరిశుభ్రత దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. బుధవారం స్థానిక ఎంపీడీవో బాలాజీ, తహసీల్దారు హనుమంతు ఆధ్వర్యంలో పాఠశాలలోని విద్యార్థులకు చేతుల పరిశుభ్రతపై అవగాహన కల్పించారు. వ్యక్తిగత ఆరోగ్యం కోసం ప్రతిఒక్కరూ చేతులు పరిశుభ్రత పాటించాలన్నారు. అలాగే ఆరోగ్య సూత్రాలను తప్పక తెలుసుకోవాలన్నారు. కార్యక్రమంలో స్థానిక సర్పంచ్ సుబ్రహ్మణ్యం రెడ్డి, పాఠశాల ప్రధానోపాధ్యాయులు నౌషాద్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఎరువుల దుకాణాల తనిఖీ



తనిఖీ చేస్తున్న విజిలెన్స్ అధికారులు

సోమల, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): సోమల మండలంలోని ఎరువుల దుకాణాలను తిరుపతి విజిలెన్స్ అధికారులు బుధవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. రికార్డులను పరిశీలించి 16 టన్నుల యూరియా అమ్మకాలు చేసినా ఆన్‌లైన్‌లో నమోదు చేయకపోవడం, రైతుల వేలిముద్రలు తీసుకోకపోవడం గుర్తించి కేసు నమోదు చేశారు. తిరుపతి విజిలెన్స్ ఏవో రామాంజనేయరెడ్డి, ఎస్ఐ రామకృష్ణ నాయక్, జగన్‌మోహన్, ఏవో సుధాకర్ పాల్గొన్నారు.

బాలికలు ఉన్నత విద్యను అభ్యసించాలి

రొంపిచెర్ల, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): బాలికలు ఉన్నత విద్యను అభ్యసించాలని.. వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలని ప్రాథమిక ఆరోగ్యకేంద్రం హెచ్ఈ రాజేశ్వరి అన్నారు. బుధవారం రొంపిచెర్ల క్రాస్‌లోని బొమ్మయ్యగారిపల్లె ఉన్నత పాఠశాలలో జరిగిన సమావేశంలో ఆమె మాట్లాడుతూ బాల్య వివాహాలకు దూరంగా ఉండాలని, మంచి పౌష్టికాహారం తీసుకోవాలని, మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని సూచించారు. కార్యక్రమంలో సీహెచ్‌వో అమ్మణ్ణి, హెచ్ఎస్ పంకజ, మహిళా పోలీస్ శిరీష పాల్గొన్నారు.

పుంగనూరు ఏబీవీపీ అధ్యక్షుడిగా కార్తీక్

పుంగనూరు రూరల్, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): పుంగనూరు పట్టణ ఏబీవీపీ అధ్యక్షుడిగా ఏ.కార్తీక్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు రాష్ట్ర సంయుక్త కార్యదర్శి సురేంద్ర తెలిపారు. బుధవారం స్థానిక డిగ్రీ కళాశాలలో ఏబీవీపీ కమిటీలో కార్యదర్శిగా వెంకటేష్, ఉపాధ్యక్షుడిగా నగేశ్, కమిటీ అధ్యక్షుడిగా వై.హరిప్రసాద్, కార్యదర్శిగా నిఖిల్, ఉపాధ్యక్షుడిగా బి.రాజు, కమిటీలో సభ్యులను ఎన్నుకున్నట్లు వివరించారు.

అంగన్‌వాడీ సహాయకురాలిపై ఫిర్యాదు

వి.కోట, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): వి.కోట మండలం ముదరందొడ్డి పంచాయతీ సుద్దులకుప్పం అంగన్‌వాడీ కేంద్రంలో సహాయకురాలిగా విధులకు రాకుండా ఏడాదిగా జీతం తీసుకుంటోందని ఆరోపిస్తూ సర్పంచ్ దామోదర్, గ్రామస్తులు బుధవారం సీడీపీవో అరుణకుమారికి ఫిర్యాదు చేశారు. విచారించి చర్యలు తీసుకుంటానని ఆమె వారికి హామీ ఇచ్చారు.

కలెక్టర్‌కు మామిడి రైతుల అభినందనలు


కలెక్టర్‌కు శాలువా కప్పి అభినందిస్తున్న గోవర్దన్ బాబి

చిత్తూరు కలెక్టరేట్, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని 32 వేల మామిడి రైతులకు ప్రభుత్వం ప్రకటించిన కిలోకు రూ.4 సబ్సిడీ మొత్తాన్ని అందించేందులో కృషి చేసిన కలెక్టర్ సుమిత్‌కుమార్‌ను ఆలిండియా ఫుడ్ ప్రాసెసర్స్ అసోసియేషన్ (సౌత్ జోన్) చైర్మన్ గోవర్దన్ బాబి శాలువ కప్పి అభినందించారు. బుధవారం కలెక్టరేట్‌లోని ఆయన ఛాంబర్‌లో కలెక్టర్‌ను కలిసి జిల్లా మామిడి రైతుల కష్టాలను గుర్తించి ప్రభుత్వంతో చర్చించి రూ.146 కోట్లు నిధులు త్వరితగతిన అందించేందులో చూపిన చొరవను ప్రశంసించారు. కార్యక్రమంలో ఉద్యానవనశాఖ డిప్యూటీ డైరక్టర్ మధుసూధన్‌రెడ్డి పాల్గొన్నారు.

పాఠశాలల్లో పక్కాగా సోషల్ ఆడిట్


ఆడిట్ నిర్వహిస్తున్న సమగ్రశిక్ష సెక్టోరియల్ అధికారులు

చిత్తూరు సెంట్రల్, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పాఠశాలలు, కేజీబీవీ ల్లోని అన్ని విభాగాల్లో సోషల్ ఆడిట్ పక్కాగా ఉండాలని సమగ్రశిక్ష అకౌంట్స్ అధికారి గుజ్జా నాగరాజు పేర్కొన్నారు. స్థానిక బీఎస్ కన్నన్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో సమగ్రశిక్ష అధికారులు బుధవారం నిర్వహించిన సోషల్ ఆడిట్‌కు జిల్లాలోని 58 పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, కేజీబీవీ ప్రిన్సిపాల్స్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా నాగరాజు మాట్లాడుతూ సామాజిక తనిఖీ ప్రజా వేదిక ఆధ్వర్యంలో గత విద్యా సంవత్సరంలో జిల్లాలోని 58 పాఠశాలల్లో సామాజిక తనిఖీ బృందం సోషల్ ఆడిట్ నిర్వహించిందన్నారు. మధ్యాహ్న భోజన పథకం నిర్వహణ, పాఠశాల రికార్డులు, నిధులు విడుదల, ఖర్చు చేసిన మొత్తాలు, మౌలిక సదుపాయాలు, పాఠశాలల్లో చేపట్టిన కార్యక్రమాలు, నిర్వహణ అంశాలపై సోషల్ ఆడిట్ నిర్వహించారన్నారు.గుర్తించిన లోపాలను సరిచేసుకోవాలని సూచించారు. సీనియర్ అసిస్టెంట్ మధు, సెక్టోరియల్ అధికారులు మధుసూదన్, నందకుమార్, శశిధర్ తదితరులు పాల్గొన్నారు.

15వ రోజుకు చేరిన పీహెచ్‌సీ వైద్యుల ధర్నా

చిత్తూరు రూరల్, అక్టోబరు 15(ఆంధ్రజ్యోతి): తమ సమస్యలను పరిష్కరించాలని కోరుతూ గత 10 రోజులుగా చిత్తూరు డీఎంహెచ్‌వో కార్యాలయం ఎదుట పీహెచ్‌సీ వైద్యులు ధర్నా బుధవారం 15వ రోజులకు చేరుకుంది. ఈ సందర్భంగా వైద్యులు మాట్లాడుతూ ఇన్ని రోజులుగా విధులు మానేసి ధర్నాలు చేస్తుంటే ప్రభుత్వంస్పందించడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. టైమ్ బౌండ్ ప్రమోషన్లు కల్పించాలని డిమాండ్ చేశారు. తాము గత 25 సంవత్సరాలుగా టైమ్ బౌండ్ ప్రమోషన్లు లభించకపోవడంతో చాలా నష్టపోయామన్నారు. పొరుగు రాష్ట్రాల్లో నిరంతరం అమలు జరుగుతున్న ఈ హక్కును ఆంధ్రప్రదేశ్‌లో నిర్లక్ష్యం జరుగుతోందన్నారు. కార్యక్రమంలో అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి డాక్టర్ శిరీషా, వైద్యాధికారులు దితరులు పాల్గొన్నారు.

విద్యుత్ వినియోగదారుల అర్జీల స్వీకరణ


అర్జీలు స్వీకరిస్తున్న ఈఈ మునిచంద్ర

చిత్తూరు రూరల్, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): విద్యుత్ వినియోగదారుల కోసం ప్రత్యేకంగా నిర్వహిస్తున్న గ్రీవెన్స్ డేలో 99 శాతం సమస్యలను అక్కడికక్కడే పరిష్కరిస్తున్నామని ఆపరేషన్ డివిజన్ ఈఈ మునిచంద్ర అన్నారు. బుధవారం స్థానిక గాంధీ రోడ్డులోని చిత్తూరు ఆపరేషన్ డివిజన్ విద్యుత్ కార్యాలయంలో విద్యుత్తు శాఖ గ్రీవెన్స్ డే నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ కార్యక్రమాన్ని మొదలు పెట్టిన నాటి నుంచి చిత్తూరు ఆపరేషన్ డివిజన్ పరిధిలో 132 అర్జీలు రాగ అందులో 121 అర్జీలు పరిష్కరించామన్నారు. వినియోగదారులు, రైతులకు విద్యుత్ పరంగా ఏ సమస్య వచ్చినా ప్రత్యేక గ్రీవెన్ డే కార్యక్రమాన్ని ఆశ్రయించవచ్చునన్నారు.

19న సూపర్ జీఎస్టీ అవగాహన కార్యక్రమాల ముగింపు


అధికారులతో సమీక్ష నిర్వహిస్తున్న డీఆర్వో మోహన్‌కుమార్


చిత్తూరు కలెక్టరేట్, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): నెల రోజుల పాటు జరుగుతున్న సూపర్ జీఎస్టీ - సూపర్ సేవింగ్స్ పై అవగాహన కార్యక్రమం ఈనెల 19న ముగుస్తుందని డీఆర్వో మోహన్‌కుమార్ తెలిపారు. బుధవారం డీఆర్వో చాంబర్‌లో సంబంధిత శాఖల అధికారులతో కార్యక్రమ నిర్వహణపై టెలికాన్ఫరెన్స్ ద్వారా ఆయన సమీక్షించారు.'సూపర్ జీఎస్టీ-సూపర్ సేవింగ్స్' కార్యక్రమం వాణిజ్య పన్నుల శాఖ ఆధ్వర్యంలో అన్ని శాఖలతో సమన్వయం చేసుకుని అవగాహన సదస్సులు నిర్వహించామన్నారు. 19న ఆదివారం జ్యోతిరావు పూలే భవనంలో ముగింపు సందర్భంగా ఎగ్జిబిషన్ నిర్వహిస్తున్నట్లు వివరించారు.

జీఎస్టీ పోస్టర్ ఆవిష్కరణ


జీఎస్టీ గోడపత్రికను ఆవిష్కరిస్తున్న కలెక్టర్

చిత్తూరు కలెక్టరేట్, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో కొనసాగుతున్న సూపర్ జీఎస్టీ - సూపర్ సేవింగ్స్ మెగా ఫెస్టివల్ సేల్స్ గోడపత్రికను కలెక్టర్ సుమిత్‌కుమార్ ఆవిష్కరించారు. బుధవారం కలెక్టరేట్‌లోని కలెక్టర్ ఛాంబర్‌లో జరిగిన ఈ కార్యక్రమంలో చిత్తూరు డివిజన్ జీఎస్టీ జాయింట్ కమిషనర్ రవీంద్రనాథ్ రెడ్డి పాల్గొన్నారు.

విద్యుదాఘాతానికి గురై ఒకరి మృతి


శ్రీరాములు(ఫైల్ ఫొటో)

శ్రీరంగరాజపురం, అక్టోబరు 15(ఆంధ్రజ్యోతి): విద్యుదాఘాతానికి గురై ఒకరు మృతి చెందారు. తిరుపతి జిల్లా ఏర్పేడు మండలం కోబాకకు చెందిన దూర్వాసులు నాయుడు బుధవారం ఎరువుల కోసం బయలుదేరాడు. తనతోపాటు ఆటోలో మోదుగులపాలెంకు చెందిన శ్రీరాములు(55)ను కూడా తీసుకువెళ్లాడు. ఎస్ఆర్ పురం పద్మాపురం రైతు సేవా కేంద్రం వద్దకు వచ్చారు. శ్రీరాములు మధ్యాహ్నం భోజనం పక్కనే ఉన్న కొళాయి వద్దకు వెళ్లాడు. అక్కడ . విద్యుదాఘాతానికి గురయ్యాడు. అపస్మారక స్థితిలో చేరుకున్న ఇతడిని ఆస్పత్రికి తరలించే క్రమంలో 108 అంబులెన్స్‌కు సమాచారం ఇచ్చారు. వారు చేరుకుని శ్రీరాములు మృతిచెందినట్లు ధ్రువీకరించారు. మృతదేహాన్ని గుట్టు చప్పుడు కాకుండా మృతుని ఇంటి వద్ద అప్పగించి వెళ్లి పోయారు. తమకు న్యాయం చేయాలని బాధిత కుటుంబీకులు డిమాండ్ చేశారు.

ఇలా ఉండేది..


వాకింగ్ ట్రాక్ ఏర్పాటు చేయకముందు ముళ్లపొదలతో ఉన్న చెరువుకట్ట

ఇలా మారింది..


చెరువు కట్టపై ఏర్పాటుచేసిన వాకింగ్ ట్రాక్

నాడు అధ్వానం.. నేడు ఆహ్లాదం

● ఎమ్మెల్యే మురళి చొరవతో చెరువుకట్టపై వాకింగ్ ట్రాక్


వాకింగ్ ట్రాక్‌పై కలెక్టర్‌కు వివరిస్తున్న ఎమ్మెల్యే మురళీమోహన్

పూతలపట్టు, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): వైసీపీ హయాంలో చిన్నపాటి సమస్యలు కూడా పరిష్కారమయ్యేవి కావు. కూటమి ప్రభుత్వంలో ఎమ్మెల్యే మురళీమోహన్ చొరవతో అలాంటి ఇబ్బంది తప్పిందని ఇక్కడి ప్రజలు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. రూపం మారిన పూతలపట్టు చెరువే ఇందుకు తార్కాణమంటున్నారు. పదెకరాల విస్తీర్ణమున్న ఈ చెరువు చిత్తూరు-కడప జాతీయ రహదారి పక్కన ఉంది. గతంలో ముళ్లకంపలు ఏపుగా పెరగడంతో ఈమార్గంలో వెళ్లడానికి పాదచారులు కూడా ఇబ్బంది పడేవారు. చీకటిపడితే భయాందోళన చెందేవారు. ఎమ్మెల్యే మురళీమోహన్ దీనిపై ప్రత్యేక దృష్టి సారించారు. ఎన్ఆర్ఈజీఎస్, ఇరిగేషన్ అధికారులతో పలుమార్లు సమావేశాలు నిర్వహించారు. కలెక్టర్‌తోనూ మాట్లాడారు. దీంతో కలెక్టర్ వచ్చి పరిశీలించారు. ఇక్కడ వాకింగ్ ట్రాక్‌కు అనుమతిచ్చారు. వెంటనే ఎన్ఆర్ఈజీఎస్ ఏపీవో సంధ్యారాణి, ఇరిగేషన్ అధికారులు పనులను ప్రారంభించారు. దాదాపుగా 80 శాతం పూర్తయ్యాయి. వాకర్లు సేద తీరడానికి చుడా అధికారులు ఇక్కడ సిమెంటు దిమ్మెలతో కూర్చీలను ఏర్పాటు చేశారు. విద్యుత్ దీపాలు ఏర్పాటు చేయడంతో పాదచారులు, ప్రజలు వాకింగ్‌ను వినియోగించుకుంటున్నారు. ఇది కదా ప్రగతి అంటూ వారంతా సంతోషం వ్యక్తం చేస్తున్నారు.



వాకింగ్ ట్రాక్ వద్ద త్వరలో ఏర్పాటు చేయనున్న ఐ లవ్ పూతలపట్టు బోర్డు

అభివృద్ధిని చూసి ఓర్వలేకే వైసీపీ విమర్శలు

● వసంతాపురం సభలో ఎమ్మెల్యే జగన్మోహన్


సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే గురజాలజగన్మోహన్ - హాజరైన మహిళలు

గుడిపాల, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వ చేపడుతున్న అభివృద్ధి పనులను చూసి ఓర్వలేక వైసీపీ నాయకులు లేనిపోని విమర్శలు చేస్తున్నారని ఎమ్మెల్యే గురజాల జగన్మోహన్, చుడా చైర్మన్ కటారిహేమలతలు అన్నారు. బుధవారం గుడిపాలలోని వసంతాపురంలో జీఎస్టీ తగ్గింపు, సూపర్ సిక్స్ సూపర్ హిట్, సింగిల్ విండో, మండల టీడీపీ అధ్యక్ష, పాలక వర్గం ప్రమాణం స్వీకారం సందర్భంగా సభ నిర్వహించారు. ఇందులో నాయకులు మాట్లాడుతూ డబుల్ ఇంజన్ సర్కార్‌లో డబుల్ వరాలు, సంక్షేమ పథకాలు అందుతున్నాయన్నారు. కూటమి ప్రభుత్వం మహిళాభివృద్ధికే కట్టుబడి ఉందన్నారు. రానున్న స్థానిక సంస్థ ఎన్నికలలో మహిళలకు పెద్దపీట వేసి వారికి 50 శాతం సీట్లు కేటాయించనున్నట్లు ఆయన తెలిపారు. అనతరం సింగిల్ విండో అధ్యక్షుడిగా ప్రతాప్‌నాయుడు, డైరెక్టర్లుగా హరిప్రసాద్, సెల్వినాథన్ ప్రమాణ స్వీకారం చేశారు. మండల టీడీపీ అధ్యక్షునిగా సుబ్రహ్మణ్యం నాయుడు, కమిటి సభ్యులు ప్రమాణ స్వీకారం చేశారు. వారిని అభిమానులు ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో మేయర్ అముద, రాష్ట్ర బీసీ కార్పొరేషన్ అధ్యక్షుడు సీఆర్.రాజన్, మాజీ ఎమ్మెల్యే ఏఎస్.మనోహర్, మాజీ ఎమ్మెల్సీ రాజసింహులు, డిప్యూటీ మేయర్ రాజేష్‌కుమార్‌రెడ్డి, కూటమి నాయకులు బాలాజీనాయుడు, నాగరాజ్‌యాదవ్, బాలసుబ్రహ్మణ్యంయాదవ్, ధనసింగ్, పీటర్,అనిల్‌కుమార్, శరత్, హేమాద్రినాయుడు, హరిప్రసాద్‌చౌదరి, రూప్‌కుమార్, రమాదేవి, దొరబాబు, అరుణ్,రవినాయుడు, సుమతి,మురళినాయుడు తదితరులు పాల్గొన్నారు.


బోల్తాపడ్డ కారు - స్వాధీనం చేసుకున్న ఎర్రచందనం దుంగలు

బోల్తా పడ్డ కారులో బయటపడ్డ ఎర్రచందనం

● రూ. 14 లక్షల విలువైన దుంగల స్వాధీనం

బంగారుపాళ్యం,అక్టోబర్ 15 (ఆంధ్రజ్యోతి): అదుపుతప్పి బోల్తాపడిన కారులో ఎర్రచందనం దుంగలు బయటపడిన వైనమిది. ఎస్సై ప్రసాద్ తెలిపిన వివరాల మేరకు..బుధవారం పలమనేరు నుంచి చిత్తూరు వైపు వెళుతున్న కారు కాటప్పగారిపల్లె వద్దకు చేరుకోగానే అదుపుతప్పింది. తక్కువ ఎత్తులో ఉన్న డివైడర్‌పైకి ఎక్కి దూసుకెళ్లింది. అదే సమయంలో ద్విచక్రవాహన చోదకుడు వెంకటస్వామిని ఢీకొని గోతిలో బోల్తాపడింది. కొందరు వెంటనే గమనించి పోలీసులకు సమాచారం ఇచ్చారు. పోలీసులు వచ్చి పరిశీలించగా కారులో సుమారు 250 కేజీల బరువు ఉన్నతొమ్మిది ఎర్రచందనం దుంగలు కనిపించాయి. వాటిని స్వాధీనం చేసుకున్నారు. దుంగల విలువ సుమారు రూ.14 లక్షలు ఉంటుందని భావిస్తున్నారు. కారు డ్రైవర్ పరారయ్యాడు. నిందితులు కూడా తప్పించుకుపోయారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేపడుతున్నట్లు ఎస్సై ప్రసాద్ తెలిపారు.

మద్యం కుంభకోణాన్ని సీబీఐకి అప్పగించాలి

● వైసీపీ నాయకుల డిమాండ్


ధర్నాలో పెద్దిరెడ్డి, భూమన తదితరులు

తిరుపతి(జీవకోన), అక్టోబరు 15(ఆంధ్రజ్యోతి): మద్యం కుంభకోణాన్ని సీబీఐకి అప్పగించి సీఎం చంద్రబాబు చిత్తశుద్ధి చాటుకోవాలని మాజీ మంత్రి, వైసీపీ రీజనల్ కోఆర్డినేటర్ పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి సూచించారు. తిరుపతిలోని జిల్లా పార్టీ కార్యాలయంలో బుధవారం జరిగిన జిల్లాస్థాయి విస్తృత సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రభుత్వానికి వ్యతిరేకంగా ఎవరు మాట్లాడినా కేసులు పెడుతున్నారని ఆరోపించారు. కార్యకర్తలు, నాయకులు కష్టపడి పార్టీని బలోపేతం చేయాలన్నారు. కిందిస్థాయి కార్యకర్తలతో ప్రభుత్వాన్ని నడిపేలా జగన్‌మోహన్‌రెడ్డి సందేశం ఇచ్చారని వైసీపీ జిల్లా అధ్యక్షుడు భూమన కరుణాకరరెడ్డి తెలిపారు. మద్యం కుంభకోణం కేసుకు సంబంధించి జగన్, పెద్దిరెడ్డే అంతా చేశారని తాను సిట్ విచారణలో చెప్పలేదని మాజీ డిప్యూటీ సీఎం నారాయణస్వామి అన్నారు. అనంతరం భూమన నివాసం వద్ద రోడ్డుపై భైఠాయించి మద్యం కుంభకోణాన్ని సీబీఐకి అప్పగించాలంటూ ధర్నా చేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీ గురుమూర్తి, ఎమ్మెల్సీలు డాక్టర్ సిపాయి సుబ్రహ్మణ్యం, భరత్, మాజీ ఎమ్మెల్యేలు, జిల్లా పార్టీ ముఖ్య నాయకులు పాల్గొన్నారు. అనంతరం మీడియా సమావేశంలోనూ ప్రభుత్వంపై పెద్దిరెడ్డి, భూమన విమర్శలు చేశారు. టీడీపీలో తమకెవరూ కోవర్టులు లేరని చెప్పారు.

సీఎం చిత్రపటానికి పాలాభిషేకం




బంగారుపాళ్యం, అక్టోబర్ 15 (ఆంధ్రజ్యోతి): మామిడి రైతుల ఖాతాలకు రాయితీ డబ్బులను జమ చేసిన సందర్భంగా బుధవారం స్థానిక మార్కెట్ యార్డు ఎదుట ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు చిత్రపటానికి ఎమ్మెల్యే మురళీమోహన్, మండల టీడీపీ అధ్యక్షుడు ఎన్పీ ధరణీప్రసాద్ ఆధ్వర్యంలో రైతులు పాలాభిషేకం చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ మామిడి రైతులను కష్టసమయాల్లో ఆదుకున్న ఘనత చంద్రబాబుకే దక్కుతుందన్నారు. ఇచ్చిన మాటకు కట్టుబడి రైతులకు సబ్సిడీ మొత్తాన్ని జమ చేశారన్నారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు ఎన్పీ జయప్రకాష్ నాయుడు, భాస్కర్ నాయుడు, జయచంద్రనాయుడు, కోదండయాదవ్, హేమచంద్రనాయుడు,కోకా ప్రకాష్‌నాయుడు,జనార్ధన్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

పరిశ్రమల అభివృద్ధితో పర్యావరణ పరిరక్షణ


పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న కలెక్టర్

చిత్తూరు కలెక్టరేట్, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): పరిశ్రమల అభివృద్ధితో పాటు పర్యావరణ పరిరక్షణ కూడా ముఖ్యమేనని కలెక్టర్ సుమిత్ కుమార్ అన్నారు. బుధవారం కలెక్టరేట్‌లోని మీటింగ్ హాలులో జిల్లా పరిశ్రమలశాఖ రూపొందించిన ఏపీఐఐసీ ఇండస్ట్రియల్ పార్ట్‌నర్‌షిప్ డ్రైవ్ పోస్టర్‌ను కలెక్టర్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ పరిశ్రమల అభివృద్ధితో పాటు పర్యావరణ పరిరక్షణ కూడా సమాంతరంగా ముందుకు సాగాలని చెప్పారు. బుధవారం నుంచి నవంబరు 15 వరకు ఏపీఐఐసీ ఇండస్ట్రియల్ పార్ట్‌నర్‌షిప్ డ్రైవ్ కొనసాగుతుందని చెప్పారు. కార్యక్రమంలో ఏపీఐఐసీ జోనల్ మేనేజర్ వైవీకే సుబ్బారావు, డీఐసీ జీఎం సూరిబాబు, పలువురు పారిశ్రామికవేత్తలు పాల్గొన్నారు.

పేటశ్రీ 'తిరుపతి కథలకు' తెలుగువర్సిటీ పురస్కారం



పేట శ్రీనివాసులురెడ్డి - తిరుపతి కథలు పుస్తకం

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): పేట శ్రీనివాసులురెడ్డి రాసిన 'తిరుపతి కథలు' పుస్తకానికి సురవరం ప్రతాపరెడ్డి తెలుగు విశ్వవిద్యాలయం పురస్కారం ప్రకటించారు. వివిధ సాహిత్య ప్రక్రియల్లో ఏటా ఈ అవార్డులను ప్రకటిస్తారు. 2023 సంవత్సరానికి గాను వచనరచనల విభాగంలో పేట శ్రీనివాసులు రెడ్డికి ఈ పురస్కారం లభించింది. ఈ నెల 29వ తేదీన హైదరాబాదు నాంపల్లిలోని ఎన్టీఆర్ కళామందిరంలో జరిగే ప్రత్యేక కార్యక్రమంలో పురస్కారం అందజేస్తారు. ఎస్వీయూ తెలుగు విభాగం రిటైర్డు ప్రొఫెసర్ అయిన ఈయన 2014లోనూ తెలుగు వర్సిటీ కీర్తి పురస్కారం అందుకున్నారు. ఇప్పటికే 20 పురస్కారాలను అందుకున్న పేటశ్రీ 25 పుస్తకాలు, 300 వ్యాసాలు రాశారు. 10 దేశాల సదస్సుల్లో పాల్గొన్నారు.

గో సంరక్షణ ట్రస్టుకు రూ.5 లక్షల విరాళం



ఐరాల(కాణిపాకం), అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): కాణిపాక వరసిద్ధుని ఆలయ ఆధ్వర్యంలో గో సంరక్షణ ట్రస్టుకు బెంగళూరుకు చెందిన కేవీ.అమర్నాథ్ రూ. 5లక్షల చెక్కు రూపంలో విరాళంగా అందించారు. దాతను ఏఈవో రవీంద్రబాబు ఆలయ మర్యాదలతో ఆహ్వానించి స్వామి దర్శన ఏర్పాట్లను పర్యవేక్షించారు. కార్యక్రమంలో సూపరింటెండెంట్ కోదండపాణి, ఆలయ ఇన్‌స్పెక్టర్ చిట్టిబాబు పాల్గొన్నారు.

అంతరాయం లేని విద్యుత్ అందించాలి

చిత్తూరు రూరల్, అక్టోబరు 15(ఆంధ్రజ్యోతి): వినియోగదారులకు అంతరాయంలేని విద్యుత్‌అందించాలని ఏపీఎస్పీడీసీఎల్ డిస్కం డైరెక్టర్ అయూబ్‌ఖాన్ అధికారులను ఆదేశించారు. బుధవారం చిత్తూరు సర్కిల్ ప్రథమ వార్షికోత్సవ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మట్లాడుతూ పీఎం సూర్యఘర్‌పై విస్తృ ప్రచారం చేయాలని సూచించారు. 300 యూనిట్లు దాటుతున్న ప్రతి ఒక్కరిని ఒప్పించి సోలార్ ప్యానళ్లను ఏర్పాటు చేయాలన్నారు. ఎస్ఈ ఇస్మాయిల్ అహ్మద్, ఈఈలు మునిచంద్ర, సురేష్ పాల్గొన్నారు.


యువకుల నృత్యప్రదర్శన

ముగిసిన యువజనోత్సవం

చిత్తూరు క్రీడల, అక్టోబరు 15(ఆంధ్రజ్యోతి): నగర శివారు ఆర్‌వీఎస్ నగర్‌లో సెట్విన్ ఆధ్వర్యంలో నిర్వహించిన యువజనోత్సవ కార్యక్రమం బుధవారం ఉత్సాహంగా ముగిసింది. జిల్లావ్యాప్తంగా కళాకారులు పెద్ద ఎత్తున పాల్గొని జానపద కళలు ప్రదర్శించారు. ఈ సందర్భంగా నిర్వహించిన నృత్య పోటీల్లో గెలుపొందిన యువతీయువకులకు అధికారులు బహుమతులు ప్రదానం చేశారు. సెట్విన్ సీఈవో యశ్వంత్ మాట్లాడుతూ స్వామి వివేకానంద జయంతి సందర్భంగా ఏటా ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామన్నారు. యువత స్వామి వివేకానందాను ఆదర్శంగా తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో డీఎస్‌డీవో బాలాజీ, యువకులు, కళాకారులు పాల్గొన్నారు.


బహుమతులు ప్రదానం చేస్తున్న సెట్విన్ అధికారులు

చిత్తూరు

జీడీ నెల్లూరు/పూతలపట్టు/నగరి

చెరువులో కలుస్తున్న వ్యర్థాలతో ఇబ్బందులు


చెరువులోకి వ్యర్థాలను వదులుతున్నారిలా..

పెనుమూరు, అక్టోబరు 15(ఆంధ్రజ్యోతి): చిత్తూరు మార్గంలోని గంగుపల్లి చెరువులో సెప్టిక్ ట్యాంక్ వ్యర్థాలు, చికెన్ సెంటర్ల వ్యర్థాలను వదిలేస్తున్నారు. దీంతో చెరువునీరు తీవ్రంగా కలుషితమవుతోంది. ఈ వ్యర్థాలు చెరువు ద్వారా భూగర్భ జలాల్లో కలవడంతో సమీప ప్రాంతాల్లోని బోర్లలో కూడా దుర్వాసనతో కూడిన నీరు వస్తోందని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. చెరువులో వ్యర్థాలు వదిలే వారిపై అధికారులు చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు కోరుతున్నారు.

ఇంజనీరింగ్ అసిస్టెంట్ లేక నిలిచిన పనులు

పెనుమూరు, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి) : ఇంజనీరింగ్ అసిస్టెంట్ లేకపోవడంతో పెనుమూరు, చార్వాగానిపల్లి, సామిరెడ్డిపల్లి సచివాలయ పరిధిలో అభివృద్ధి పనులకు ఇబ్బంది ఎదురవుతోంది. ఇక్కడి ఇంజినీరింగ్ అసిస్టెంట్‌ను డెప్యుటేషన్‌పై ఇరిగేషన్ కార్యాలయానికి పంపడంతో మండల కేంద్రంతో పాటు మరో ఆరు పంచాయతీల్లో పనులు నిలిచిపోయాయి. తాగునీరు, రోడ్ల నిర్మాణం, ఆసుపత్రి, డ్రైనేజీ నిర్మాణాల పనులు నిలిచిపోయాయి. సాంకేతిక సిబ్బంది లేకపోవడంతో బిల్లులు, కొత్త పనుల రూపకల్పన స్తంభించింది. వేరొకరిని నియమించాలంటే కలెక్టర్ అనుమతించాలని ఎంపీడీవో చెబుతున్నారు.

కొనసాగుతున్న హైరోడ్డు విస్తరణ పనులు


ప్రైవేటు భవనాన్ని తొలగిస్తున్న అధికారులు

చిత్తూరు అర్బన్, అక్టోబరు 15(ఆంధ్రజ్యోతి): నగరంలో హైరోడ్డు విస్తరణ పనులు వేగం పుంజుకునాయి.. బుధవారం ఈక్రమంలో కమిషనర్ నరసింహ ప్రసాద్ ఆదేశాల మేరకు తిరుపతి రోడ్డులోని కట్టమంచి వద్ద ఓ ప్రైవేటు భవనాన్ని యజమాని అంగీకారంతో తొలగించారు. ఏసీపీలు నాగేంద్ర, శుభప్రద పర్యవేక్షించారు. టౌన్‌ప్లానింగ్ సిబ్బంది, టీటీపీ సిబ్బంది, ప్రణాళిక విభాగం అధికారుల సమన్వయంతో రోడ్డుకు అవసరమైన వంద అడుగుల వరకు రోడ్డు విస్తీర్ణపు పనులు జరుగుతున్నాయి.

పంచాయతీల ఆదాయ వనరులు పెంచాలి


శిక్షణ ఇస్తున్న మనోరంజని

పెనుమూరు, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): గ్రామ పంచాయతీల ఆర్థిక స్థిరత్వం కోసం స్థానిక వనరులను సద్వినియోగం చేసుకోవాలని ఎంపీడీవో నీలకంఠేశ్వర్ రెడ్డి సూచించారు. మండల కార్యాలయంలో సెక్రటరీలు, ఇంజినీరింగ్ అసిస్టెంట్‌లకు బుధవారం శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ట్రైనర్ మనోరంజనీ మాట్లాడుతూ ప్రభుత్వ భూములను కాపాడి, చెరువులు, వాగులు, వంకలను సంరక్షిస్తే పంచాయతీకి ఆదాయం వస్తుందన్నారు. చేపలు పెంపకం, లీజ్‌లు, వృక్షారోపణ వంటి కార్యక్రమాలు ఆదాయ వనరులుగా మారాలన్నారు.

పోషకాహారంపై అవగాహన


పోషకాహార స్టాల్‌ను తిలకిస్తున్న అధికారులు

విజయపురం, అక్టోబరు 15(ఆంధ్రజ్యోతి): చక్కెర వినియోగంపై గర్భిణులు, బాలింతలకు సీడీపీవో ఇందిర ప్రియ దర్శిణి బుధవారం అవగాహన కల్పించారు. ఆమె మాట్లాడుతూ 0-3 సంవత్సరాల పిల్లలు తీసుకోవలసిన పోషకాహారం గురించి వివరించారు. వెయ్యి రోజుల్లో పిల్లల మెదడు చురుగ్గా అభివృద్ధి చెందుతుందన్నారు. వారికి కథలు, బొమ్మలతో ఉత్తేజపరచాలని సూచించారు. రక్తహీనత, ఊబకాయంపై ప్రతి ఒక్కరూ తెలుసుకోవాలన్నారు. పోషకాహారాలను ప్రదర్శించారు. కార్యక్రమంలో ఎంఈవో హరిప్రసాద్‌వర్మ, సింగిల్‌విండో అధ్యక్షుడు బాబుయాదవ్, మండల పరిషత్ కార్యాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

హైస్కూల్ ఆడిటోరియం ప్రారంభం


ఆడిటోరియంను ప్రారంభిస్తున్న జగన్మోహన్,చెన్నకేశవనాయుడు

గుడిపాల, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): ప్రతి విద్యార్థి ఉన్నత స్థాయికి ఎదగాలని ఎమ్మెల్యే గురజాలజగన్మోహన్, జీజేఎం చారిటబుల్ ట్రస్టు నిర్వాహకులు చెన్నకేశవులనాయుడు, గురజాల జగ్గజీవన్ అన్నారు. బుధవారం నరహరిపేట జడ్పీ హైస్కూల్‌లో నిర్మించిన ఆడిటోరియం, తాగునీటి బోరు,సైన్స్ ల్యాబ్‌ను ప్రారంభించారు. ఇంటర్ విద్యార్థులకు యూనిఫాంను అందించారు. కార్యక్రమంలో మాజీ జడ్పీటీసీ సభ్యులు బాలాజీనాయుడు, విద్యాకమిటీ ఛైర్మన్ డిల్లిబాయి, హెచ్‌ఎం దుర్వాసులు, నాయకులు వైవీ.రాజేశ్వరి, లలిత, ఉదయ, మధుసూదన్‌నాయుడు, నాగరాజ్‌యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

జీఎస్టీ తగ్గింపుపై అవగాహన


విద్యార్థులకు వివరిస్తున్న అన్నపూర్ణశారద

వెదురుకుప్పం, అక్టోబరు 15(ఆంధ్రజ్యోతి) వైఎస్ఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో బుధవారం జీఎస్టీ 2.0 రెండవ దశ అవగాహన కార్యక్రమం జరిగింది. పన్నుల విధానం, జీఎస్టీ ప్రాముఖ్యత, ప్రభుత్వ ఆర్థిక విధానాలపై అవగాహన కల్పించడం కార్యక్రమ లక్ష్యమని కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ అన్నపూర్ణశారద తెలిపారు. ప్రతీ విద్యార్థి జీఎస్టీపై అవగాహన పెంపొందించుకోవాలన్నారు. తరువాత మానవహారం నిర్వహించారు.

18న ప్రదోష కాల పూజ

ఐరాల(కాణిపాకం), అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): కాణిపాకంలోని మణికంఠేశ్వర స్వామి ఆలయంలో ఈనెల 18న ప్రదోష కాల పూజను నిర్వహించనున్నట్లు ఈవో పెంచల కిషోర్ తెలిపారు. త్రయోదశి పురస్కరించుకుని సాయంత్రం 5 గంట నుంచి 6 గంటల మధ్య ఈ పూజను నిర్వహించనున్నట్లు ఆయన పేర్కొన్నారు.

వరసిద్ధుడి సేవలో మాజీ మంత్రి కన్నా



ఐరాల(కాణిపాకం), అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): మాజీ మంత్రి, సత్తెనపల్లె ఎమ్మెల్యే కన్నాలక్ష్మీనారాయణ బుధవారం కాణిపాక వరసిద్ధుని దర్శించుకున్నారు. ఆయనకు ఈవో పెంచల కిషోర్ ఆలయ మర్యాదలతో ఆహ్వానించి స్వామి దర్శన ఏర్పాట్లను పర్యవేక్షించారు. దర్శనానంతరం ఆయన్ను వేదాశీర్వాద మండపంలో వేదమంత్రాలతో ఆశీర్వదించి స్వామి శేషవస్త్రాలు, తీర్థప్రాదాలు,జ్ఞాపికను అందించారు. ఏఈవో రవీంద్రబాబు, సూపరింటెండెంట్ కోదండపాణి, ఆలయ ఇన్‌స్పెక్టర్ చిట్టిబాబు పాల్గొన్నారు.

అంగన్వాడీ కేంద్రం తనిఖీ


రికార్డు పరిశీలిస్తున్న ఆలీ హష్మి

వెదురుకుప్పం, అక్టోబరు 15(ఆంధ్రజ్యోతి): కార్వేటినగరం మండలం ఎన్ఆర్‌కండ్రిగ అంగన్వాడీ కేంద్రాన్ని బుధవారం నీతి ఆయోగ్ డైరెక్టర్ ఎండీ జుబైర్ ఆలీ హష్మి, ప్రాజెక్టు డైరెక్టర్ వెంకటేశ్వరి తనిఖీ చేశారు. రికార్డులను తనిఖీ చేశారు. ప్రభుత్వం నుంచి సరఫరాల అవుతున్న పౌష్టికాహార వివరాల గురించి సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు.

మైనర్ బాలిక అదృశ్యం

వెదురుకుప్పం, అక్టోబరు 15(ఆంధ్రజ్యోతి): కార్వేటినగరం మండల కేంద్రంలోని ఓ మైనర్ బాలిక(15) అదృశ్యమైనట్లు తల్లిదండ్రులు బుధవారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

తోతాపురికి రూ.8 చెల్లించాలి

బంగారుపాళ్యం,అక్టోబర్ 15 (ఆంధ్రజ్యోతి): మామిడి రైతులకు ప్రభుత్వం నిర్ణయించిన ప్రకారం గుజ్జుపరిశ్రమల నుంచి కేజీ రూ.8 చెల్లించాలని మామిడి రైతుల సంఘ అధ్యక్ష,కార్యదర్శులు జనార్థన్ ,మునీశ్వర్‌రెడ్డిలు కోరారు. బుధవారం మాధవనగర్ వద్ద బ్రహ్మానంద ఆశ్రమంలో మామిడి రైతుల ఆక్రందన సభ జరిగింది. ఈ సందర్భంగా ఏపీ రైతు సంఘ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ప్రభాకర్ రెడ్డి మాట్లాడుతూ మామిడి రైతులకు చెల్లించాల్సిన కేజీ రూ.8 విషయంలో ప్రభుత్వం ఆలస్యం చేస్తోందన్నారు. రైతులకు రూ.8 చెల్లించకుంటే నవంబర్‌లో తిరిగి ఉద్యమిస్తామని ఆయన హెచ్చరించారు. కార్యక్రమంలో సీపీఎం జిల్లా కార్యదర్శి వాడా గంగరాజు,రైతు సంఘ ఉపాధ్యక్షురాలు హేమలత,మురళి,ఉమాపతి నాయుడు,శివారెడ్డి, సురేంద్రతో పాటు పలువురు నాయకులు, మామిడి రైతులు పాల్గొన్నారు.

ఏపీకి బ్రాండ్ అంబాసిడర్ చంద్రబాబు

● ఎమ్మెల్యే గురజాల జగన్మోహన్

చిత్తూరు సిటీ, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): విశాఖ కేంద్రంగా గూగుల్ సేవలు అందించనుందని ఎమ్మెల్యే గురజాల జగన్మోహన్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. సీఎం చంద్రబాబు నాడు హైదరాబాద్‌ను సాఫ్ట్‌వేర్ రంగంలో ప్రపంచస్థాయిలో నిలబెట్టారని, నేడు ఏపీలోని విశాఖపట్నాన్ని ప్రపంచస్థాయి నగరంగా నిలబెట్టేందుకు కృషిచేస్తున్నారన్నారు. డేటా సెంటర్ ఏర్పాటుపై గూగుల్ సంస్థతో ప్రభుత్వం ఒప్పందం కుదుర్చుకోవడంతో సుమారు 1.88 లక్షల ఉద్యోగ అవకాశాలు వస్తాయన్నారు. ఏఐ హబ్‌గా విశాఖ మారబోతోందన్నారు.గూగుల్ డేటా సెంటర్ గ్రామీణ స్థాయిలో ఆర్థిక వ్యవస్థను బలోపేతం చేసి విస్తృత సేవలు అందించబోతోందని పేర్కొన్నారు.

ఆటో డ్రైవర్‌కు గాయాలు

నగరి, అక్టోబరు15(ఆంధ్రజ్యోతి): చెన్నై..తిరుపతి జాతీయ రహదారిపై కారు ఢీకొనడంతో ఆటో డ్రైవర్ గాయాలపాలయ్యాడు. బుధవారం తిరుపతి నుంచి మురళి ఆటోలో టూత్‌పేస్టులు, బ్రష్‌లు తీసుకుని నగరికి వస్తూ రోడ్డుపక్కన వాహనాన్ని ఆపాడు. అడ్రస్ అడుగుతుండగా తిరుపతి నుంచి నగరి వైపు వస్తున్నకారు ఢీకొంది. ప్రమాదంలో రెండు వాహనాలు దెబ్బతిన్నాయి. గాయపడిన మురళి తిరుపతికి చెందినవాడు. ఇతడ్ని నగరి ఏరియా వైద్యశాలకు తరలించారు.

రాష్ట్ర స్థాయి నెట్‌బాల్‌కు ఎంపిక

చిత్తూరు సెంట్రల్, అక్టోబరు 15(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర స్థాయి నెట్ బాల్ క్రీడా పోటీలకు స్థానిక బృందావన్ సీనియర్ సెకండరీ కాలేజ్ విద్యార్థులు కె.వైష్ణవ్‌రెడ్డి, డి.ధీరజ్ విఘ్నేష్ చౌదరిలు ఎంపికైనట్లు కరస్పాండెంట్ శైలజకుమారి తెలిపారు. బుధవారం మదనపల్లె జెడ్పీ ఉన్నత పాఠశాలలో నిర్వహించిన జిల్లా స్థాయి నెట్‌బాల్ క్రీడల్లో దాదాపు 20 పాఠశాలల నుంచి 200 మంది క్రీడాకారులు పాల్గొన్నారన్నారు.


మొరవ పారడానికి సిద్ధంగా ఉన్న మహావీరపురం చెరువు - నిండు కుండలా మంగళం చెరువు

చెరువులకు జలకళ

విజయపురం, అక్టోబరు 13(ఆంధ్రజ్యోతి): మండలంలో రెండు రోజుల పాటు కురిసిన వర్షాలకు చెరువుల్లో జలకళ సంతరించుకుంది. మండలంలో మొత్తం 42 చెరువులకు గాను 8 చెరువులు నిండుకుండలా మారి మొరవ పారడానికి సిద్ధంగా ఉన్నాయి. సుమారు 20 చెరువులు సగానికి పైగా నిండాయి. మిగిలిన 14 చెరువులకు వరవ కాలువలు లేక పోవడంతో పంట పొలాల నీరు చెరువులకు చేరుతుంది. వర్షాలు ఇలాగే కురిస్తే గత యేడాది కంటే ముందే చెరువులు పూర్తిగా నిండుతాయని రైతులు చెబుతున్నారు. చెరువు కట్టల లీకేజీ, బలహీనంగా ఉంటే సమాచారం ఇవ్వాలని మండల ఇరిగేషన్ ఏఈ ప్రశాంత్ కోరారు.

అంగన్వాడీ భవనాల నిర్మాణానికి నిధులు


పచ్చజెండా ఊపి బస్‌సర్వీస్ ప్రారంభిస్తున్న థామస్

గంగాధరనెల్లూరు, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): పలు అంగన్వాడీ కేంద్రాలకు పక్కా భవనాలు నిర్మాణానికిగాను నిధులు విడుదల చేయించామని రాష్ట్ర ప్రభుత్వవిప్ డాక్టర్ థామస్ చెప్పారు. పోషణ మాసోత్సవాల్లో భాగంగా ఐసీడీఎస్ ప్రాజెక్ట్ ఆఫీస్‌లో బుధవారం పౌష్టికాహారం ప్రదర్శనను ఆయన పరిశీలించారు. గర్భిణులకు సామూహిక సీమంతాలు చేసి పౌష్టికాహారం కిట్‌లను అందించారు. అనంతరం థామస్ మాట్లాడుతూ వైసీపీ నేతల తీరును విమర్శించారు. గత వైసీపీ ప్రభుత్వం రాష్ట్ర ఖజానా ఖాళీచేసి కూటమి ప్రభుత్వానికి అప్పులు కుప్ప అందించిందన్నారు. కార్యక్రమంలో కూటమినేతలు ఎర్రగుంట్ల కృష్ణమనాయుడు, స్వామిదాస్, శ్రీధర్‌యాదవ్, ఇందిరమ్మ, రుద్రయ్యనాయుడు, నీలావతి, పొన్న యుగంధర్,తదితరులు పాల్గొన్నారు. ● వెన్‌సన్ సమకూర్చిన కొత్త బస్ సర్వీస్‌ను గంగాధరనెల్లూరు అల్లియెల్లమ్మ గుడి వద్ద టీడీపీ, జనసేన, బీజేపీనేతలతో కలిసి థామస్ పచ్చజెండా ఊపి ప్రారంభించారు. నేతలు దేవపత్ని ధనంజయనాయుడు, మహేష్‌నాయుడు, తాళూరి శివనాయుడులు కలిసి వెన్సన్ ట్రాన్స్‌పోర్ట్ అధినేత గుణశేఖర్‌ను ఒప్పించి బస్సు సర్వీస్‌లు తేవడం సంతోషంగా ఉందన్నారు. ఏఎంసీ ఛైర్మన్ ఎర్రగుంట్ల కృష్ణమనాయుడు, త్యాగరాజన్, శ్రీధర్‌యాదవ్, మోహన్‌నాయుడు, స్వామిదాస్, రుద్రయ్యనాయుడు, పొన్న యుగంధర్, రాజేంద్రన్ పాల్గొన్నారు.

పాలాభిషేకం

చిత్తూరు సిటీ, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): సాయి బాబా ఆలయంలో స్వపాలాభిషేకం ఘనంగా బుధవారం నిర్వహించారు. షిరిడి సాయిబాబా మహా సమాధి చెంది 107 సంవత్సరాలైన సందర్భంగా కట్టమంచిలోని షిరిడి విశ్వసాయి బాబా ఆలయంలో ఈ కార్యక్రమం నిర్వహించారు.

దెబ్బతిన్న వరిపంట పరిశీలన


వరిపంటను పరిశీలిస్తున్న తహసీల్దార్ పార్థసారథి

యాదమరి, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): దళవాయిపల్లె, మాదిరెడ్డిపల్లి, కాశిరాల గ్రామాల్లో భారీ వర్షాలకు దెబ్బతిన్న వరి పంటను తహసీల్దార్, వ్యవసాయ శాఖ సిబ్బంది బుధవారం పరిశీలించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ పార్థసారథి మాట్లాడుతూ వరిపంట నష్టంపై తుది నివేదికలను సంబంధిత శాఖాధికారులకు త్వరలోనే పంపిస్తామన్నారు. తెలిపారు. బాధిత రైతులను ఆదుకుంటామని ఆయన భరోసా ఇచ్చారు.

ఈ-అన్నదాత కార్డులను సద్వినియోగం చేసుకోవాలి


సమావేశంలో మాట్లాడుతున్న గుణశేఖర్‌రెడ్డి,తదితరులు

చిత్తూరు సిటీ, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): ఈ-అన్నదాత కార్డులను రైతులు సద్వినియోగం చేసుకోవాలని ఈ-అన్నదాత కార్డుల జిల్లా కో ఆర్డినేటర్ గుణశేఖర్ రెడ్డి సూచింఅచు. బుధవారం చిత్తూరు ప్రెస్‌క్లబ్‌లో ఆయన మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం అందిస్తున్న ఈ పథకాన్ని సద్వినియోగంచేసుకోవాలని అన్నారు. చిత్తూరు గిరింపేటలో ఈ-అన్నదాత కార్డుల మంజూరు జిల్లా కేంద్రాన్ని ప్రారంభించారని చెప్పారు. రైతులు అన్నదాత కార్డును పొందడం వల్ల రూ.5 లక్షల వరకు బీమా వర్తిస్తుందన్నారు. పంట బీమా కింద రూ.25 లక్షలు, రైతు కిసాన్ కార్డుతో 500 కన్నా ఎక్కువ కొనుగోలు చేస్తే 40 శాతం రాయితీ లభిస్తుందన్నారు. అవకాశాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో భార్గవి, రామకృష్ణరాజు, ఉష, మాధవి, చాముండేశ్వరి, కుమారి పాల్గొన్నారు.

మామిడి సబ్సిడీ విడుదలతో బ్యాంకుల రద్దీ



పెనుమూరు, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి) : మామిడి రైతుల ఖాతాలకు ప్రభుత్వం సబ్సిడీ జమ చేయడంతో బుధవారం వారంతా బ్యాంకుల్లో క్యూ కట్టారు. మండలంలోని నాలుగు బ్యాంకులూ మంగళవారం కిటకిటలాడాయి 1242 మంది రైతులకు రూ. 5.32 కోట్లు ఖాతాలో జమ అయింది. దీపావళీ ముందుగానే వచ్చినట్టయిందని సంతోషం వ్యక్తం చేశారు.

సర్వీస్ రోడ్డు పరిశీలన

బంగారుపాళ్యం,అక్టోబర్ 15 (ఆంధ్రజ్యోతి): నిత్యం ప్రమాదాలకు నిలయంగా మారిన తంబుగానిపల్లెకు వెళ్లే సర్వీసు రోడ్డు పనులను బుధవారం పూతలపట్టు ఎమ్మెల్యే మురళీమోహన్, మాజీ ఎమ్మెల్యే ఎన్పీ వెంకటేశ్వరచౌదరిలు పరిశీలించారు. గ్రామస్తులు మాట్లాడుతూ ఎమ్మెల్యే,కలెక్టరు చొరవతో సర్వీసు రోడ్డు ఏర్పాటు చేస్తుండడంతో గ్రామస్తులు హర్షం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో మండల టిడిపి అధ్యక్షుడు ఎన్పీ ధరణీప్రసాద్, గౌరవ అధ్యక్షుడు ఎన్పీ జయప్రకాష్, క్లస్టర్ ఇన్‌చార్జీ మోమన్ నాయుడులు ఉన్నారు.

ఘనంగా శ్రీవారి కళ్యాణోత్సవం


సారె తెస్తున్న భక్తులు

చిత్తూరు సిటీ, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): తరిగొండ వెంగమాంబ అన్న ప్రసాద ట్రస్ట్ ఆధ్వర్యంలో స్థానిక కట్టమంచిలోని ఎల్‌జీబీ కళ్యాణమండపంలో శ్రీదేవి భూదేవి సమేత వెంకట్వేరస్వామి వారి కల్యాణోత్సవాన్ని నిర్వహించారు. భక్తులు శ్రీవారికి సారె సమర్పించారు. ట్రస్ట్ సభ్యులు ఈశ్వర్, నళిని తిరుకుమరన్, మల్లిఖార్జునాచారి, సిద్దార్థ, గజ, మురుగ పాల్గొన్నారు.

ఉన్నత లక్ష్యాలపై దృష్టి పెట్టాలి

వెదురుకుప్పం, అక్టోబరు 15(ఆంధ్రజ్యోతి): ఉన్నత లక్ష్యాలపై విద్యార్థులు దృష్టి సారించాలని కార్వేటినగరం ట్రైనీ ఎస్ఐ రమేష్ సూచించారు. బుధవారం కార్వేటినగరం ఎస్ఎల్ఎన్ జూనియర్ కళాశాలలో ఆయన సామాజిక మాధ్యమాలపై అవగాహన కల్పించారు. విద్యార్థి దశలో ఇన్‌స్టాగ్రాం,ఫేస్‌బుక్ వంటి వాటికి దూరంగా ఉండాలన్నారు. విద్యకు ప్రాధాన్యత ఇచ్చి రాణించాలన్నారు. డైరెక్టర్ దిలీఫ్‌కుమార్, ఉద్యోగులు పాల్గొన్నారు.

సైబర్ నేరాలపై విద్యార్థులకు అవగాహన


అవగాహన కల్పిస్తున్న జ్ఞానప్రకాష్

చిత్తూరు అర్బన్, అక్టోబరు 15(ఆంధ్రజ్యోతి): పెరుగుతున్న సైబర్ నేరాలపై బుధవారం సంతపేట హైస్కూల్ విద్యార్థులకు రెండో పట్టణ పోలీసులు అవగాహన సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా రక్షక్-2 ఇన్‌ఛార్జీ జ్ఞాన ప్రకాష్ మాట్లాడుతూ కాలానుగుణంగా సైబర్ క్రైమ్ రకరకాల రూపాలను సంతరించుకుంటోందన్నారు. సెల్‌ఫోన్లకు వచ్చే అనవసర,అనుమానిత లింకులను క్లిక్ చేయడం వల్ల ప్రమాదంలో పడతామన్నారు. విద్యార్థులంతా తల్లిదండ్రులకు సైబర్ క్రైమ్‌పై అవగాహన కల్పించాలన్నారు.

మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలి

శ్రీరంగరాజపురం, అక్టోబరు 15(ఆంధ్రజ్యో): యువత మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని ఎస్ఐ సుమన్ కోరారు. బుధవారం విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రజలకు ఏదైనా సమస్యలుంటే నేరుగా పోలీస్ స్టేషన్‌కు కానీ, 112గానీ ఫోన్ చేస్తే న్యాయం చేస్తామన్నారు. ఫ్రైండ్లీ పోలీస్ ద్వారా ప్రజలందరూ సేవలను వినియోగించుకోవాలన్నారు. కోడిపందేలు, పేకాటలు ఆడితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ద్విచక్ర వాహన చోదకులు హెల్మెట్ ధరించి వాహనం నడపలని సూచించారు.

రేపు మండల సమావేశం

గుడిపాల, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): మండల సర్వసభ్య సమావేశాన్ని శుక్రవారం నిర్వహించనున్నట్లు ఎంపీడీవో శిరీష బుధవారం తెలిపారు. ఎంపీడీవో కార్యాలయంలో ఉదయం 10 గంటలకు ఈ సమావేశం జరుగుతుందన్నారు. అధికారులందరూ తప్పక హాజరు కావాలన్నారు.

రెవెన్యూ సమస్యలపై అర్జీదారులతో ముఖాముఖి


అధికారులతో సమీక్షిస్తున్న ఆర్డీవో అనుపమ

పాలసముద్రం, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): పీజీఆర్ఎస్ ద్వారా రెవెన్యూ సమస్యలపై అందిన ఫిర్యాదులకు సంబంధించి ఆర్డీవో అనుపమ బుధవారం అర్జీదారులతో మాట్లాడారు. తహసీల్దార్ కార్యాలయంలో ఆమె వారి సమస్యలను తెలుసుకున్నారు. అనంతం ఆమె అధికారులతో సమీక్ష నిర్వహంచారు. ఆమె మాట్లాడుతూ పీజీఆర్ఎస్ ద్వారా అందిన ఫిర్యాదులను పరిష్కరించ వలసిన బాధ్యత అధికారులపై ఉందన్నారు. ఒకే సమస్యపై ఎక్కువ సార్లు ఫిర్యాదు చేసిన అర్జీదారులను పిలిపించి సమస్యను తెలుసుకుని పరిష్కరిస్తామన్నారు. తహసీల్దార్ అరుణకుమారి, ఎంపీడీవో షతీష్, డీటీ రిషీవర్మ, ఆర్ఐ దేవి, వీఆర్వోలు పాల్గొన్నారు.

ఉపాధి పనులు వేగవంతం చేయండి

పాలసముద్రం, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): ఉపాధి పనులలో అవినీతికి తావు లేకుండా పనులను వేగవంత చేయాలని ఎంపీడీవో షతీష్ పేర్కొన్నారు. బుధవారం ఎంపీడీవో కార్యాలయంలో ఉపాధి సిబ్బందితో ఆయన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రస్తుతం మండలంలోని 13 పంచాయతీలలో కలసి ఆరు వందల లోపు కూలీలు మాత్రమే పనులు నిర్వహిస్తున్నారన్నారు. ప్రతి పంచాయతీలో వంద మంది కూలీలు ఉపాధి పనులకు వచ్చేలా చూడాలన్నారు. ఏపీవో మార్గరేట్, ఈసీ రామమూర్తీ, టీఏలు, ఎఫ్ఏలు పాల్గొన్నారు.